పత్రికతో.. మార్పులు
APTEL/25/A1880
TN తెలుగు న్యూస్
మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..
దిన పత్రిక
సంపుటి : 1 సంచిక : 699 పబ్లిషర్స్ & చీఫ్ ఎడిటర్ : యన్. కృష్ణారావు ఎడిటర్ : ఎస్. మస్తాన్ గురువారం 27.08.2026 పేజీలు : 8 వెల : 4/-

## ఇక రాష్ట్రమంతటా 'సంజీవని'..
# సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

### జనవరి 1 నుంచి ఏపీలో 'సంజీవని' ప్రాజెక్టు అమలు

- కుప్పం, చిత్తూరులో విజయవంతం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ
- ఏఐ, డిజిటల్ హెల్త్ రికార్డులకు ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం ఆదేశం
- ప్రజల ఆరోగ్య సమాచారానికి పూర్తి భద్రత, గోప్యత
- కుటుంబాలపై వైద్య ఖర్చుల భారం తగ్గించడమే లక్ష్యం



అమరావతి, ఆగస్టు 26 : ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ 'సంజీవని' ప్రాజెక్టును జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కుప్పం, చిత్తూరు నియోజకవర్గాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసిన ఈ ప్రాజెక్టు అద్భుతమైన ఫలితాలు ఇవ్వడంతో, దీనిని రాష్ట్రమంతా విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన 90 రోజుల కార్యాచరణ ప్రణాళికను అధికారులు సీఎంకు వివరించారు. ఈ సమీక్ష సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత ఆరోగ్య సేవలు, ప్రతి పౌరునికి డిజిటల్ హెల్త్ రికార్డులు, వ్యాధుల ముందస్తు గుర్తింపు, సరైన చికిత్స, ఆ తర్వాత ఫాలోఅప్‌కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. డిజిటల్ హెల్త్ రికార్డులతో ఈ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అమలు చేస్తే వైద్య సేవల్లో పెను మార్పులు తీసుకురావచ్చని, దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. తరువాయి 2లో




## ఆ శాఖకు నేను
# సంరక్షకుడిని మాత్రమే

- ముంబైలో ఫార్చ్యూన్ ఇండియా సంస్థ '40 అండర్ 40' అవార్డుల కార్యక్రమం
- ముఖ్య అతిథిగా హాజరైన నారా లోకేశ్
- ఆర్పీఎస్జీ గ్రూప్ వైస్ చైర్మన్ శాశ్వత్ గోయెంకా అడిగిన ప్రశ్నలకు లోకేశ్ జవాబులు



- కేంద్రమంత్రి చిరాగ్ పాశ్వాన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న నారా బ్రహ్మణి

2లో

## ఏఐతో మానవ సమాజానికి
# భారీ ప్రమాదం పొంచి ఉంది

- ఏఐ పట్ల ప్రభుత్వాలు అప్రమత్తం కావాలన్న బిల్ గేట్స్
- కొన్ని రంగాలు మాత్రమే మానవులకు ఉపాధిని ఇవ్వగలవని అంచనా
- ఉపాధి రంగంలో తీవ్ర సంక్షోభం రానుందని ఆందోళన



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వేగంగా విస్తరిస్తున్న తరుణంలో మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ అంతర్జాతీయ సమాజానికి తీవ్ర హెచ్చరికలు చేశారు. ప్రభుత్వాలు గనుక త్వరితగతిన అప్రమత్తమై నిబంధనలు తీసుకురాకపోతే మానవ సమాజానికి భారీ ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. గత సాంకేతిక విప్లవాలు ఉద్యోగ అవకాశాలను పెంచినప్పటికీ, ఏఐ విప్లవం మాత్రం అందుకు పూర్తి భిన్నమైనదని గేట్స్ స్పష్టం చేశారు. ఏఐ వల్ల అనేక ఉద్యోగాలు శాశ్వతంగా కనుమరుగైపోతాయని, కేవలం తరువాయి 2లో

## నేపాల్‌లో జల విలయం..
### ప్రధాని బాలేన్ షాతో మాట్లాడిన మోదీ



- నేపాల్‌ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు
- 105 మంది భారతీయులు సహా 384 మంది పర్యాటకులు గల్లంతు
- సహాయక చర్యలు ముమ్మరం
- నేపాల్ ప్రధానితో ఫోన్ లో మాట్లాడిన మోదీ, సాయానికి సిద్ధమని ప్రకటన

2లో

## దేశంలో హెచ్1ఎన్1 విజృంభణ..
# మళ్లీ మాస్కులు ధరించాల్సిందేనా?

- రోజంతా మాస్క్ ధరించాల్సిన అవసరం లేదంటున్న డాక్టర్లు
- రద్దీ, గాలి ప్రసరణ లేని ప్రదేశాల్లో మాస్క్ ధరించడం మంచిదని సూచన
- అనారోగ్యంగా ఉంటే ఇంట్లోనే ఉండటం ఉత్తమమని సలహా
- బయటకు వెళ్లాల్సి వస్తే మాస్క్ ధరించాలని సూచన
- వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు మరింత అప్రమత్తంగా ఉండాలని సలహా



దేశంలోని పలు ప్రాంతాల్లో హెచ్1ఎన్1 కేసులు పెరుగుతున్న నేపథ్యంలో బయటకు వెళ్లేటప్పుడు మాస్క్ ధరించాలా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ప్రతి ఒక్కరూ రోజంతా మాస్క్ ధరించాల్సిన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు. రద్దీగా ఉండే మెట్రోలు, ఆసుపత్రులు, కిక్కిరిసిన వెయిటింగ్ రూమ్‌లు, గాలి ప్రసరణ సరిగా లేని ఇండోర్ ప్రాంతాల్లో మాస్క్ ఉపయోగించడం అదనపు రక్షణ అందిస్తుంది. ముఖ్యంగా జ్వరం, దగ్గు, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలున్నవారు ఇతరులకు దూరంగా ఉండటంతో పాటు బయటకు తరువాయి 2లో

## పేపర్ లీక్ ఆరోపణలు..
### మహారాష్ట్ర డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రిక్రూట్‌మెంట్ రద్దు

- పేపర్ లీక్ ఆరోపణలతో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ గ్రూప్-బి పరీక్ష రద్దు
- మొత్తం రిక్రూట్‌మెంట్ ప్రక్రియను రద్దు చేసిన మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్
- ప్రశ్నపత్రాన్ని రూ.40 లక్షలకు అమ్మారని ప్రతిపక్షాల ఆరోపణ
- విషయాన్ని తీవ్రంగా పరిగణించిన సీఎం.. సమగ్ర దర్యాప్తునకు హామీ
- ఇది అభ్యర్థుల పోరాట విజయమన్న కాంగ్రెస్ నేత




మహారాష్ట్రలో ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారం కలకలం సృష్టించడంతో మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎంపీఎస్సీ) కీలక నిర్ణయం తీసుకుంది. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ గ్రూప్‌బి పోస్టుల భర్తీకి సంబంధించి చేపట్టిన నియామక ప్రక్రియను రద్దు చేస్తున్నట్లు బుధవారం ప్రకటించింది. ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన ఈ పరీక్షలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై చేపట్టిన ప్రాథమిక విచారణ అనంతరం ఈ మేరకు చర్యలు తీసుకుంది. ఈ పరీక్ష ప్రశ్నపత్రాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఏజెంట్ల ద్వారా ఒక్కో అభ్యర్థికి రూ. 40 లక్షల చొప్పున తరువాయి 2లో

## 'ఐఆర్‌సీటీసీ'తో
### 70 శాతం యూజర్లకు తిప్పలు.. సర్వేలో షాకింగ్ నిజాలు!




## బెంగళూరు విమానంలో కలకలం
# టిష్యూ పేపర్‌పై 'బాంబు' అని రాసిన నోట్




- లక్నో-బెంగళూరు ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు
- ల్యాండింగ్‌కు ముందు టాయిలెట్‌లో బాంబు నోట్ గుర్తింపు
- విమానం సేఫ్ ల్యాండింగ్...
- ప్రయాణికులను దించిన అధికారులు
- తనిఖీల్లో ఉత్తిదేనని తేల్చిన బాంబ్ స్క్వాడ్

లక్నో నుంచి బెంగళూరుకు వస్తున్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడం తీవ్ర కలకలం సృష్టించింది. విమానం ల్యాండ్ కావడానికి మరికొద్ది నిమిషాల ముందు ఈ విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న అధికారులు వెంటనే అప్రమత్తమై తనిఖీలు చేపట్టారు. చివరికి అది కేవలం వట్టి బెదిరింపు అని తేలడంతో ప్రయాణికులు, విమాన సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. బుధవారం ఉదయం ఇండిగో విమానం (6E231) బెంగళూరులో ల్యాండ్ అయ్యేందుకు సిద్ధమవుతుండగా, విమానంలోని టాయిలెట్ వద్ద ఉన్న ఒక టిష్యూ పేపర్‌పై 'బాంబు' అని రాసి ఉండటాన్ని క్యాబిన్ సిబ్బంది గుర్తించారు. వెంటనే వారు పైలట్‌ను అప్రమత్తం చేయగా, ఆయన ఎయిర్ తరువాయి 2లో

# ఆ శాఖకు నేను సంరక్షకుడిని మాత్రమే: ముంబైలో నారా లోకేశ్

వ్యాపారమైనా, రాజకీయమైనా తాను నిర్వహించే సంస్థలకు, శాఖలకు కేవలం సంరక్షకుడిని (కస్టోడియన్) మాత్రమేనని, తనకు అప్పగించిన బాధ్యతలను మరింత మెరుగైన స్థితికి తీసుకెళ్లడమే తన లక్ష్యమని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. పెట్టుబడుల ఆకర్షణలో స్పీడ్, సర్వీస్, స్టెబిలిటీ అనే మూడు సూత్రాలే తమ విజయ రహస్యాలని ఆయన వెల్లడించారు. దేశంలోని యువ వ్యాపారవేత్తలు, ప్రతిభావంతులకు ఫార్చ్యూన్ ఇండియా సంస్థ '40 అండర్ 40' పేరుతో ముంబైలో అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్, మంత్రి నారా లోకేశ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

ఈ వేడుకలో భాగంగా, డైరీ రంగంలో విలువ ఆధారిత ఉత్పత్తుల విభాగంలో హెరిటేజ్ సంస్థ సాధించిన ప్రగతికి గాను, ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నారా బ్రహ్మణికి కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ చేతుల మీదుగా 'ఫార్చ్యూన్ ఇండియా 40 అండర్ 40' అవార్డును ప్రదానం చేశారు.






### ఏపీ పెట్టుబడుల రహస్యం ఇదే

అనంతరం జరిగిన ఇంటరాక్టివ్ సెషన్‌లో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఆర్పీఎస్జీ గ్రూప్ వైస్ చైర్మన్ శాశ్వత్ గోయెంకా అడిగిన పలు ప్రశ్నలకు ఆయన ఆసక్తికర సమాధానాలిచ్చారు. "ప్రభుత్వ నిర్వహణలో మీరు క్రమశిక్షణ పాటిస్తున్నారు. పొదుపు గురించి మాట్లాడారు. ఈ ఆలోచన మీకు ఎక్కడి నుంచి వచ్చింది?" అని గోయెంకా ప్రశ్నించగా, లోకేశ్ బదులిచ్చారు. "వ్యాపారంలో అయినా, రాజకీయాల్లో అయినా మనం నిర్వహించే సంస్థలకు కేవలం సంరక్షకులం మాత్రమేనని నేను బలంగా నమ్ముతాను. ఒక మంత్రిగా నేను ఇక్కడికి వచ్చింది కేవలం మానవ వనరుల అభివృద్ధి, విద్యాశాఖకు సంరక్షకుడిగా మాత్రమే. గతంలో వ్యాపారంలో, ఇప్పుడు ప్రభుత్వ బాధ్యతల్లోనూ ఇదే విధానాన్ని అనుసరిస్తున్నాను" అని వివరించారు. పెట్టుబడుల కోసం అన్ని రాష్ట్రాలు పోటీ పడుతున్న తరుణంలో ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా నిలబెట్టేది ఏమిటన్న ప్రశ్నకు లోకేశ్ రెండు ప్రధాన కారణాలను తెలిపారు. "మొదటిది, మేము అనుసరించే మూడు 'ఎస్'ల విధానం. స్పీడ్ (వేగం), సర్వీస్ (సేవ), స్టెబిలిటీ (స్థిరత్వం). మేము ఎంత వేగంగా అనుమతులు ఇస్తున్నామో చాలా పరిశ్రమలకు తెలుసు. ఇక సర్వీస్ విషయానికొస్తే, పెట్టుబడిదారులకు వారి ప్రాజెక్టుల పురోగతిపై ప్రతి శనివారం రాత్రి నేనే స్వయంగా మెసేజ్ పంపి ఫీడ్‌బ్యాక్ ఇస్తాను. మూడోది, విధానాల్లో స్థిరత్వం. ప్రభుత్వాలు మారినా మా విధానాలు కొనసాగుతాయి. ఇది పెట్టుబడిదారులకు భరోసా ఇస్తుంది" అని లోకేశ్ అన్నారు. "రెండో ముఖ్య కారణం ముఖ్యమంత్రి చంద్రబాబు గారు. సీబీఎన్ అంటే అదొక బ్రాండ్. ఆయనకు అద్భుతమైన ట్రాక్ రికార్డు ఉంది. పెట్టుబడులకు అవసరమైన తలుపులు తెరువగల ముఖ్యమంత్రి ఉండటంతో మా పని సగం సులభమవుతుంది. మిగిలిన సగం పనిని నేను సమావేశ మందిరంలో ఒప్పందాన్ని ఖరారు చేయడం ద్వారా పూర్తి చేస్తాను. మా ఇద్దరి భాగస్వామ్యమే ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా నిలుపుతోంది" అని లోకేశ్ తెలిపారు. కుటుంబ వ్యాపారాల్లో ఉన్న యువత తమ కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి, కొత్త రంగాల్లో పరిశోధనలపై భారీగా పెట్టుబడులు పెట్టాలని లోకేశ్ పిలుపునిచ్చారు. అంతరిక్షం, క్వాంటమ్ టెక్నాలజీ, మెటీరియల్ సైన్సెస్ వంటి రంగాల్లో భారతదేశం ఎంతో సాధించగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. "రేపటి తరం గర్వపడేలా ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి నగరం చరిత్ర సృష్టించబోతోంది. ప్రపంచమంతా చెప్పుకునేలా ఒక మోడల్‌ను ఏపీలో నిర్మించాలన్నది మా లక్ష్యం. ఈ మార్పులో మీరంతా భాగస్వాములు కావాలి. మేము చేసే ప్రతి తప్పు నుంచి నేర్చుకోవడానికి, రాష్ట్రాన్ని మరింత మెరుగ్గా తీర్చిదిద్దడానికి మీ సలహాలు స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నాం" అని యువ పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి లోకేశ్ అన్నారు.

ఇక రాష్ట్రమంతటా 'సంజీవని'..

## సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

(మొదటిపేజీ తరువాయి)
ప్రజల ఆరోగ్య సమాచారం యొక్క గోప్యతకు, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు అధికారులను గట్టిగా ఆదేశించారు. ప్రతి వ్యక్తి ఆరోగ్యానికి సంబంధించిన అప్‌డేట్‌లను నేరుగా వారి మొబైల్ ఫోన్‌లకే పంపేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని సూచించారు. వ్యాధులను ముందుగానే గుర్తించి, నివారణ చర్యలు చేపట్టడం, సరైన సమయంలో చికిత్స అందించడం ద్వారా కుటుంబాలపై పడే వైద్య, విద్యా ఖర్చుల భారాన్ని గణనీయంగా తగ్గించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ఈ లక్ష్య సాధనలో 'సంజీవని' ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వం విశ్వసిస్తోంది.

## దేశంలో హెచ్1ఎన్1 విజృంభణ.. మళ్లీ మాస్కులు ధరించాల్సిందేనా?

(మొదటిపేజీ తరువాయి)
వెళ్లాల్సి వస్తే మాస్క్ ధరించాలని సూచిస్తున్నారు. హెచ్1ఎన్1 శ్వాసకోశ కణాల ద్వారా వ్యాపిస్తుంది. అందువల్ల గాలి ప్రసరణ బాగా ఉండే ప్రదేశాలతో పోలిస్తే రద్దీగా, మూసి ఉన్న ప్రాంతాల్లో వైరస్ వ్యాప్తి ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. అధిక రక్షణ కోసం సరైన విధంగా అమర్చిన ఎన్95 మాస్క్ ఉపయోగపడుతుంది. అయితే మాస్క్ ధరించడం మాత్రమే పూర్తి రక్షణ కాదని, అనారోగ్యంగా ఉన్నప్పుడు ఇంట్లోనే ఉండటం, గదుల్లో గాలి ప్రసరణ మెరుగుపరచడం, దగ్గుతుమ్ముల సమయంలో జాగ్రత్తలు తీసుకోవడం, చేతులు శుభ్రంగా ఉంచుకోవడం వంటి చర్యలు కూడా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, దీర్ఘకాలిక అనారోగ్యాలతో ఉన్నవారు హెచ్1ఎన్1 విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తీవ్ర బలహీనత, నిరంతర అధిక జ్వరం, ఆక్సిజన్ స్థాయిలు పడిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ప్రస్తుతం హెచ్1ఎన్1 కేసుల పెరుగుదల కొత్త మహమ్మారికి సంకేతం కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ప్రజలు భయపడకుండా పరిస్థితిని బట్టి మాస్క్, పరిశుభ్రత, గాలి ప్రసరణ వంటి జాగ్రత్తలను పాటించాలని సూచిస్తున్నారు.

## బెంగళూరు విమానంలో కలకలం టిష్యూ పేపర్‌పై 'బాంబు' అని రాసిన నోట్

(మొదటిపేజీ తరువాయి)
ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) అధికారులకు సమాచారం అందించారు. ఉదయం 9:40 గంటల సమయంలో విమానం సురక్షితంగా ల్యాండ్ అయిన వెంటనే, ముందుజాగ్రత్త చర్యగా దానిని విమానాశ్రయంలోని ఒక ప్రత్యేక ప్రదేశానికి తరలించారు. ప్రయాణికులను, సిబ్బందిని సురక్షితంగా కిందకు దించిన అనంతరం, సీఐఎస్ఎఫ్ బాంబ్ డిటెక్షన్ అండ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో కలిసి విమానం అంతటా క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. క్యాబిన్, సీట్లు, ఓవర్‌హెడ్ కంపార్ట్‌మెంట్లు, టాయిలెట్లతో సహా విమానంలోని అన్ని భాగాల్లో సోదాలు నిర్వహించినప్పటికీ, ఎలాంటి పేలుడు పదార్థాలు, అనుమానాస్పద వస్తువులు లభించలేదు. దీంతో అది ఆకతాయిల పనేనని నిర్ధారించుకున్న అధికారులు, విమానాన్ని తిరిగి కార్యకలాపాలకు అనుమతించారు. ఆ నోట్ ఎవరు రాశారనే అంశంపై అధికారులు ప్రస్తుతం దర్యాప్తు జరుపుతున్నారు.

## ఏఐతో మానవ సమాజానికి భారీ ప్రమాదం పొంచి ఉంది

(మొదటిపేజీ తరువాయి)
కొన్ని రంగాలు మాత్రమే మానవులకు ఉపాధిని ఇవ్వగలవని తెలిపారు. ఏఐ కోడింగ్ సామర్థ్యాలు తనను ఎంతగానో ఆశ్చర్యపరిచాయని, నిపుణులైన మనుషుల కంటే మెరుగ్గా పనిచేస్తున్న ఈ సాంకేతికత వల్ల సమీప భవిష్యత్తులోనే ఉపాధి రంగంలో తీవ్ర సంక్షోభం రానుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐ కంపెనీలు దీనివల్ల వచ్చే ముప్పును తక్కువ చేసి చూపిస్తున్నాయని, పెట్టుబడులు తగ్గిపోతాయనే భయంతో అసలు ఆందోళనలను బహిరంగంగా అంగీకరించడం లేదని విమర్శించారు. మనుషుల ఉపాధిని కాపాడేందుకు గేట్స్ కొన్ని సంచలనాత్మక ప్రతిపాదనలు చేశారు. ఏఐ, రోబోలను ఉపయోగిస్తూ మనుషులను ఉద్యోగాల నుంచి తొలగించే కంపెనీలపై ప్రత్యేక పన్ను (Robot / AI Tax) విధించాలని, ఆ ఆదాయంతో ఉద్యోగాలు కోల్పోయిన వారికి పునరావాసం కల్పించాలని సూచించారు. అలాగే కొన్ని రంగాలను కేవలం "మనుషులకు మాత్రమే పరిమితం" (Human Reserved) చేయాలని... ఉదాహరణకు వైద్యరంగంలో రోగికి వ్యాధి వివరాలు చెప్పడం లేదా కేర్ గివింగ్ వంటి బాధ్యతలను మనుషులే నిర్వహించేలా చట్టాలు తేవాలని ప్రతిపాదించారు. అంతేకాకుండా, జీవాస్త్రాలు లేదా కొత్త రకం రసాయన ఆయుధాలను అభివృద్ధి చేసేందుకు ఏఐని దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందంటూ హెచ్చరించారు. అణు ఆయుధాలు, అంతర్జాతీయ విమానయానానికి ఉన్నట్లే ఏఐ వినియోగం, నియంత్రణ కోసం ప్రపంచవ్యాప్తంగా కఠినమైన ఒప్పందాలు, పర్యవేక్షణ సంస్థలు ఏర్పాటు కావాలని సూచించారు.

## నేపాల్‌లో జల విలయం.. ప్రధాని బాలేన్ షాతో మాట్లాడిన మోదీ

(మొదటిపేజీ తరువాయి)
పొరుగు దేశం నేపాల్‌ను భారీ వరదలు ముంచెత్తాయి. రసువా ప్రాంతంలోని భోటే కోశీ నదిలో బుధవారం ఆకస్మికంగా సంభవించిన వరదల కారణంగా పెను విషాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో 100 మందికి పైగా భారతీయులతో సహా వందలాది మంది పర్యాటకులు గల్లంతయ్యారు. ఈ విపత్కర పరిస్థితుల్లో నేపాల్‌కు అండగా నిలుస్తామని భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. బుధవారం నేపాల్ ప్రధాని బాలేంద్ర షాతో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడారు. వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు. నేపాల్‌కు అవసరమైన అన్ని రకాల మానవతా సాయం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఆయన హామీ ఇచ్చారు. "ఈ కష్టకాలంలో నేపాల్ సోదర సోదరీమణులకు భారత ప్రజలు తోడుగా ఉంటారు. సహాయక చర్యల కోసం మన బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి" అని మోదీ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. నేపాల్ టూరిజం బోర్డు (ఎన్టీబీ) విడుదల చేసిన ప్రాథమిక నివేదిక ప్రకారం, ఈ వరదల్లో మొత్తం 384 మంది పర్యాటకులు గల్లంతయ్యారు. వీరిలో 105 మంది భారతీయులు, 93 మంది నేపాల్ పౌరులు, మిగిలిన వారు విదేశీయులు ఉన్నారు. గల్లంతైన విదేశీయులలో యూకే, ఆస్ట్రేలియా, అమెరికా, మలేషియా, దక్షిణాఫ్రికా, నెదర్లాండ్స్ దేశాలకు చెందిన వారు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అయితే, ఈ సంఖ్య ప్రాథమికమైనదేనని, ట్రావెల్ ఏజెన్సీలు, స్థానిక అధికారులతో కలిసి వివరాలను ధ్రువీకరిస్తున్నామని ఎన్టీబీ స్పష్టం చేసింది. గల్లంతైన వారు తొమ్మిది వేర్వేరు ట్రావెల్ ఏజెన్సీల ద్వారా నేపాల్ పర్యటనకు వచ్చారని ప్రాథమిక సమాచారం. కాఠ్మండు టైమ్స్ కథనం ప్రకారం, ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు ఏడుగురు మరణించినట్లు నిర్ధారణ అయింది. గల్లంతైన వారి ఆచూకీ కోసం అధికారులు, సహాయక బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. సమాచారం లేదా సహాయం కోసం పర్యాటకులు, వారి కుటుంబ సభ్యుల కోసం నేపాల్ టూరిజం బోర్డు పలు ఎమర్జెన్సీ నంబర్లను (1234, 1144, 9851289445) జారీ చేసింది. వరద ప్రభావిత ప్రాంతాల్లోని పర్యాటకులు ఆందోళన చెందవద్దని, అధికారిక ప్రకటనలను అనుసరించాలని సూచించింది.

## పేపర్ లీక్ ఆరోపణలు..

### మహారాష్ట్ర డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రిక్రూట్‌మెంట్ రద్దు

విక్రయించారని ప్రతిపక్ష ఎన్సీపీ (ఎస్పీ) ఎమ్మెల్యే రోహిత్ పవార్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారం కమిషన్ దృష్టికి వచ్చినప్పటికీ, కేవలం ఒక్క అభ్యర్థికి మాత్రమే ప్రశ్నాపత్రం చేరిందని పేర్కొనడం సరికాదని ఆయన విమర్శించారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ ఎంపీఎస్సీ ఛైర్మన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు, ఈ అంశంపై తాను ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను కలిసి చర్చించానని బీజేపీ ఎమ్మెల్యే అభిమన్యు పవార్ వెల్లడించారు. పేపర్ లీకేజీని ముఖ్యమంత్రి తీవ్రంగా పరిగణించారని, దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. పరీక్షకు ముందే ఒక అభ్యర్థికి ప్రశ్నపత్రం అందినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో



తేలడంతో, ఈ ఘటన తీవ్రతను పరిగణనలోకి తీసుకుని నియామక ప్రక్రియనే రద్దు చేస్తున్నట్లు ఎంపీఎస్సీ స్పష్టం చేసింది. కాగా, ఈ నిర్ణయాన్ని కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత విజయ్ వడెట్టివార్ స్వాగతించారు. ఇది పేపర్ లీకేజీలకు వ్యతిరేకంగా పోరాడుతున్న అభ్యర్థులకు లభించిన విజయమని ఆయన అభివర్ణించారు.

## 'ఐఆర్‌సీటీసీ'తో 70 శాతం యూజర్లకు తిప్పలు.. సర్వేలో షాకింగ్ నిజాలు!

ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) వెబ్‌సైట్, యాప్‌ల ద్వారా టికెట్లు బుక్ చేసుకునే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్టు ఒక జాతీయ సర్వేలో వెల్లడైంది. లోకల్‌సర్కిల్స్ నిర్వహించిన ఈ సర్వే ప్రకారం, దాదాపు 70 శాతం మంది వినియోగదారులు సమస్యలను ఎదుర్కొంటున్నట్లు తేలింది. టికెట్లు బుక్ చేసే సమయంలో ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండానే తమ ఖాతాలు ఉన్నట్టుండి లాగౌట్ అవుతున్నాయని మెజారిటీ వినియోగదారులు ఫిర్యాదు చేశారు. సర్వేలో పాల్గొన్న వారిలో 42 శాతం మందికి ఈ సమస్య తరచుగా ఎదురవుతుండగా, 28 శాతం మంది అప్పుడప్పుడు ఇటువంటి అనుభవం ఎదురవుతోందని తెలిపారు. ఇలా అకస్మాత్తుగా లాగౌట్ అవ్వడం వల్ల అనుకున్న రైలులో బెర్తులు దొరక్కపోవడం లేదా నిర్దేశిత సీట్లను కోల్పోవాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే కాకుండా మరో ఐదు రకాల సమస్యలు కూడా యూజర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఈ సర్వే గుర్తించింది.

* వాటిలో ప్రధానంగా: నాగింగ్ (46 శాతం): టికెట్ బుకింగ్ లేదా రద్దు సమయంలో యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని లేదా వ్యక్తిగత సమాచారం అందించాలని పదేపదే ఒత్తిడి చేయడం.
* బాస్కెట్ స్నీకింగ్ (45 శాతం): వినియోగదారుల ప్రమేయం లేకుండానే ఇన్సూరెన్స్, విరాళాలు వంటి అదనపు రుసుములను గుట్టుచప్పుడు కాకుండా బిల్లులో చేర్చడం.
* డ్రిప్ ప్రైసింగ్ (43 శాతం): పన్నులు మినహా ఇతర ఛార్జీలను ముందుగా వెల్లడించకుండా, తుది చెల్లింపు సమయంలో మాత్రమే చూపించడం.
* బైట్ అండ్ స్విచ్ (38 శాతం): తొలుత ఎంచుకున్న రైలు, సీటుకు బదులుగా బుకింగ్ ప్రక్రియ ముగిసే సమయానికి మరొకటి కేటాయించడం.
* ఇంటర్‌ఫేస్ ఇంటర్‌ఫియరెన్స్ (31 శాతం): బుకింగ్ ప్రక్రియ కొనసాగుతున్నప్పుడు ఇతర ప్రమోషన్లు లేదా ప్రకటనలు అడ్డురావడం.
* దేశవ్యాప్తంగా 324 జిల్లాల్లోని 90,000 మందికి పైగా వినియోగదారుల నుంచి లోకల్‌సర్కిల్స్ ఈ వివరాలను సేకరించింది. వినియోగదారుల అనుభవాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో ఐఆర్‌సీటీసీ జులై మధ్యలో కొత్త వెబ్‌సైట్‌ను ప్రారంభించిన కొద్దికాలానికే ఈ సర్వే ఫలితాలు వెలువడటం గమనార్హం. ముఖ్యంగా రద్దీ సమయాల్లో టికెట్ బుకింగ్‌లో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ఇంకా కొనసాగుతున్నాయని ఈ సర్వే నివేదిక స్పష్టం చేస్తోంది.

## హైదరాబాద్ నుంచి నేపాల్ వెళ్లిన వారు సురక్షితం

* **బాధితులను రప్పిస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే పార్థసారథి**

హిమాలయ దేశం నేపాల్‌ను మెరుపు వరదలు ముంచెత్తాయి. ఈ ఆకస్మిక ప్రకృతి బీభత్సంలో ఇప్పటివరకు 95 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 500 మంది వరకు గల్లంతయ్యారు. ఇదే సమయంలో కైలాస మానసరోవర యాత్ర కోసం తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లిన యాత్రికుల భద్రతపై ఆందోళన నెలకొనగా, వారంతా క్షేమంగా ఉన్నట్లు తెలియడంతో కుటుంబసభ్యులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే, కైలాస మానసరోవర యాత్రకు హైదరాబాద్ నుంచి వెళ్లిన 156 మంది యాత్రికుల బృందం సురక్షితంగా ఉన్నట్లు సమాచారం అందింది. వరదల ప్రభావం లేని ప్రాంతంలో వారు క్షేమంగా ఉన్నారని అధికారులు తెలిపారు. వీరంతా చైనా సరిహద్దుకు సమీపంలో సురక్షితంగానే ఉన్నప్పటికీ, భారీ వర్షాలు, వరదల కారణంగా రోడ్డు మార్గాలు పూర్తిగా కొట్టుకుపోయాయి. దీంతో వారు ఉన్న ప్రాంతం నుంచి నేపాల్ రాజధాని కాఠ్‌మాండూ చేరుకోవడం కష్టతరంగా మారింది. తమను సురక్షితంగా స్వదేశానికి చేర్చేందుకు ప్రభుత్వం సహాయం చేయాలని వారు కోరుతున్నారు. వీరిలో, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన యాత్రికులు కూడా ఉన్నారు. తాము ప్రస్తుతం చైనా భూభాగంలోని డార్చి ప్రాంతంలో ఓ హోటల్ లో ఉన్నామని, భూమికి 15 వేల అడుగుల ఎత్తులో ఉండడం వల్ల తమకేమీ వరద ముప్పులేదని తెలిపారు. అయితే, తాము సెప్టెంబరు 1న భారత్ తిరిగి రావాల్సి ఉందని, తమ వీసాలు ట్రావెల్ ఏజెన్సీ వద్ద ఉండడంతో ఎలా రావాలో అర్థం కావడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి వెంటనే స్పందించారు. ఆయన నేపాల్‌లో చిక్కుకున్న యాత్రికులతో ఫోన్‌లో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. వారిని సురక్షితంగా వెనక్కి తీసుకువచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వంతో సమన్వయం చేసి తగిన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

## సంపాదకీయం

# పట్టు తప్పుతున్న అధిష్ఠానాలు

# పతనమవుతున్న పార్టీ క్రమశిక్షణ

రాజకీయ పార్టీలు గతంలో మాదిరిగా క్రమశిక్షణా చర్యలు చేపట్టడం లేదు. అంటే, చేపట్టే ధైర్యం చేయలేకపోతున్నాయి. ఇంతకుముందు రోజుల్లో ఒక పార్టీ నుండి మరో పార్టీలోకి మారటం అంటే నామోషీగా ఉండేది. అందుకనే పార్టీ క్రమశిక్షణకు లోబడి ఉండేవారు; అప్పట్లో ఆప్షన్స్ కూడా తక్కువగా ఉండటం ఇందుకు మరో కారణం. ప్రస్తుతం భారతీయ జనతా పార్టీ మినహాయించి మిగిలిన పార్టీలన్నీ ఈ సమస్యను ఎదుర్కొంటున్నాయి. తెలంగాణ శాసనసభ్యురాలు కొండా సురేఖ గతంలో నాగార్జున, సమంతల గురించి అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసినప్పుడు ఖచ్చితంగా క్రమశిక్షణా చర్యలు చేపడతారు అనుకున్నారు; కనీసం మంత్రి పదవికి ఉద్వాసన పలుకుతారు అని ప్రజలు భావించారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ విషయం మీద కనీసం ఎటువంటి వ్యాఖ్యానం చేయలేదు. ఆ రోజు కొండా సురేఖ సాటి మహిళ గురించి చేసిన వ్యాఖ్యలలోని అశ్లీలత సామాన్యమైనది కాదు. కానీ పార్టీ రాష్ట్ర శాఖ గానీ, ఢిల్లీ అధిష్ఠానం గానీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. కేటీఆర్‌ను విమర్శించడానికి ఆమె ఎంచుకున్న మార్గం సరైనది కాదు; ఆమె ఎంచుకున్న మార్గం కంటే ఆమెను కనీసం మందలించని పార్టీ వైఖరి మరింత సరికాదు. ఆంధ్రప్రదేశ్‌లో తిరువూరు శాసనసభ్యుడు కొలికపూడి శ్రీనివాసరావు పరిస్థితి కూడా ఇటువంటిదే. టీవీల్లో ఆయన వాగ్ధాటి చూసి సీటు ఇచ్చిందో, లేక అమరావతి రైతు ఉద్యమానికి సంఘీభావంగా నిలిచినందుకు ఇచ్చిందో కానీ, తిరువూరు రూపురేఖలు తెలియని ఆయనకు తెలుగుదేశం పార్టీ సీటు ఇచ్చింది. ఆయన ప్రస్తుతం నియోజకవర్గంలో సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. ఎంపీపైనా, నలభై సంవత్సరాలుగా టీడీపీకి చెమటోడ్చి పని చేస్తున్న స్థానిక నాయకులతోనూ ఆయనకు సఖ్యత లేదు; వైసీపీ వాళ్ళు కూడా చేయనన్ని ఆరోపణలు చేస్తూ ఉంటారు. కొండా సురేఖ నియోజకవర్గంలో పట్టున్న అభ్యర్థి; కొలికపూడి శ్రీనివాసరావు కేవలం పార్టీ జెండా చాటున అధికారంలోకి వచ్చిన మనిషి. రెండు మూడు సార్లు మందలించి వదిలిపెట్టిన అధిష్ఠానం విసిగిపోయి, "ఈ ఐదు సంవత్సరాలు కళ్ళు మూసుకుని భరిద్దాం" అనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఆఖరుకు ఆయనపై ఒక మహిళ లైంగిక వేధింపుల ఆరోపణలు చేసినా మిన్నకుండిపోయింది పార్టీ. జనసేన శాసనసభ్యుడు ఆరవ శ్రీధర్ వ్యవహారం పార్టీని నవ్వులపాలు చేసింది. జనసేన నిన్న కాక మొన్న పుట్టిన పార్టీ కాబట్టి చర్యలు తీసుకోలేదని అనుకోవచ్చు; కానీ నూట నలభై సంవత్సరాల కాంగ్రెస్ పార్టీది అదే పరిస్థితి, నలభై సంవత్సరాల తెలుగుదేశం పార్టీది అదే కథ. భారత రాష్ట్ర సమితి అయినా ఇందుకు మినహాయింపు కాదు. వారిని పార్టీ నుండి తీసేసే ధైర్యం చేసే పరిస్థితిలో పార్టీలు లేవు; ఎందుకంటే పార్టీ నుండి తీసేస్తే విపక్ష పార్టీ కండువా కప్పుకోవడానికి ఒక్క నిమిషం కూడా ఆలోచించడం లేదు. సంఖ్యాబలం అధికంగా ఉన్న తెలుగుదేశం పార్టీది అదే పరిస్థితి, తెలంగాణలో అత్తెసరు సంఖ్యాబలం ఉన్న కాంగ్రెస్ పరిస్థితి కూడా అదే. వేరే పార్టీల నుండి వచ్చేవారికి ఆహ్వానం పలికే సంస్కృతిని అన్ని పార్టీలు పెంచి పోషించడమే దీనికి ప్రధాన కారణం. ఈరోజు ఉన్న పదకొండు మంది శాసనసభ్యుల బలానికే ప్రతిపక్ష హోదా ఇవ్వాలని పట్టుబడుతున్న వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి, 2019-2024 మధ్యకాలంలో తెలుగుదేశం శాసనసభ్యులను ఆకర్షించి, వచ్చిన నలుగురితో పాటు మరో ఇద్దరిని చేర్చుకుని చంద్రబాబుకు ఉన్న ప్రతిపక్ష నాయకుడి హోదా పోయేలా చేయాలని విశ్వప్రయత్నం చేశారు. ఉన్న శాసనసభ్యులు పార్టీకి నిబద్ధులై ఉన్నారు కాబట్టి చంద్రబాబు రాజకీయ ప్రస్థానంలో ఏదో ఒక పదవి లేని సందర్భం లేకుండా గడిచింది.ఇప్పుడు దేశంలో భారతీయ జనతా పార్టీ ఒక్కటే ఇటువంటి పరిస్థితిలో లేకపోవడం గమనార్హం. పార్టీ అధ్యక్షులు ఎవరున్నా పార్టీని నడిపేది మాత్రం మోదీ, అమిత్ షాల ద్వయమే. అమిత్ షా అంటే వాళ్ళ పార్టీ వారికే కాదు, ఏ పార్టీ వారికైనా భయమే; ఆఖరుకు ఆర్ఎస్ఎస్ మాట కూడా వాళ్ళిద్దరూ ఖాతరు చేయరు. ఇదొక దశ; ఎల్లకాలం ఇలాగే ఉండదని మన దేశ రాజకీయ పార్టీల చరిత్ర చెబుతోంది. నెహ్రూ హయాంలో స్వాతంత్ర్య పోరాట యోధుల ప్రాధాన్యతతో కాంగ్రెస్ నడిచింది; ఇందిరాగాంధీ హయాంలో పార్టీపై నియంతృత్వం నడిచింది. ఇప్పుడు అమిత్ షా అంటే పార్టీలో ఎంత భయం ఉందో, ఇందిరాగాంధీ అంటే అంతకంటే ఎక్కువ భయమే ఉండేది. అయితే అప్పటికి దేశంలో కమ్యూనిస్టు పార్టీలు తప్ప వేరే ఇతర పార్టీలు లేవు కాబట్టి, పార్టీలను నిట్టనిలువుగా చీల్చడానికి వ్యవస్థలను ఉపయోగించడం సాధ్యపడలేదు. అప్పటికి కమ్యూనిస్టు పార్టీలలో సానుభూతిపరుల స్థాయి నుండి పార్టీ సభ్యులు అయ్యే స్థితికి రావడానికి జీవితం సగం ముగిసిపోయేది; అందుకని వ్యవస్థలను ప్రయోగించి వారిని ఇబ్బంది పెట్టడం అసాధ్యంగా ఉండేది. వారిని ఇబ్బంది పెట్టగలిగే ఏకైక వ్యవస్థ ఎన్నికల వ్యవస్థ మాత్రమే. అప్పటి కాంగ్రెస్ పార్టీ సభ్యులపై కూడా గాంధేయవాదం అనే సిద్ధాంతం పనిచేసేది; కాబట్టి పార్టీలు కొంతమేర సిద్ధాంతపరంగా ఉండేవి. నిదానంగా కాంగ్రెస్ పార్టీలో ప్రత్యర్థులపై చెప్పులు విసిరే వై.ఎస్. రాజశేఖరరెడ్డి లాంటి వారు స్థానం పొందగలిగారు. ఇందిరాగాంధీ మరణానంతరం అధికారంలోకి వచ్చిన రాజీవ్ గాంధీకి పార్టీపై అంత పట్టు చిక్కలేదు. ప్రత్యామ్నాయం పెద్దగా లేని రోజుల్లో సోనియా గాంధీ పట్టు బిగించగలిగారు. ఇక బీజేపీ ప్రస్థానం మోదీ, అమిత్ షాల వశమయ్యాక వారి పెత్తందారీ వ్యవస్థలో దినదిన ప్రవర్ధమానమైంది. ఇది కూడా కాలపరీక్షకు బలికాక తప్పదు. కాంగ్రెస్ మాదిరిగానే బీజేపీ కూడా తయారైంది, పెద్దగా తేడా లేదనేది కనిపిస్తోంది. సిద్ధాంతాల బలం లేని పార్టీలు రంగంలో ఉన్నాయి కాబట్టి ప్రజలు ప్రత్యామ్నాయం లేని తీర్పులు ఇస్తున్నారు; అది బీజేపీకి వరంగా మారింది. పాత కాంగ్రెస్ పార్టీ పెద్దలే కొత్త బీజేపీ పెద్దలు. అవకాశం ఉన్నంత కాలం అణగిమణగి ఉంటారు, అవకాశాలు మృగ్యమయ్యాక ఎదురుతిరుగుతారు. ప్రజలు కూడా ప్రత్యామ్నాయం కనిపించక ఎవరో ఒకరికి ఓటేస్తున్నారు. పెత్తందారులు ప్రయోగించే వ్యవస్థలకు నాయకులు భయపడతారు కానీ ప్రజలు భయపడరు. ఈరోజు కొండా సురేఖ లాంటి వారికి బీజేపీ గాలం వేయవచ్చు. వేరే పార్టీలో స్థానం కోసం కాంగ్రెస్‌ను దుయ్యబడుతున్న సురేఖ, ఏదో ఒకరోజు కొత్తగా చేరే పార్టీని ఇంతకంటే ఎక్కువగా దుయ్యబడుతుంది; ఆ విషయం ఆయా రాష్ట్ర అధినాయకులకూ తెలుసు. సిద్ధాంతాలకు విలువ లేకుండా అధికారం కోసమే ప్రాకులాడుతున్న రాజకీయ వ్యవస్థలో, పార్టీలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న వారిని ఏమీ చేయలేక పార్టీలు అచేతనంగా చూస్తూ ఉండిపోతున్నాయి. ప్రతిపక్షం ప్రజా సమస్యలపై కాకుండా కేవలం అధికార పక్షంపై మాత్రమే పోరాటం చేసినంత కాలం కొండా సురేఖలు, కొలికపూడి శ్రీనివాసరావులు వారిని గెలిపించిన పార్టీలను ఇబ్బంది పెడుతూనే ఉంటారు.ఈ ఉదంతాలలో పార్టీలతో పాటు ప్రజలు కూడా మోసపోవడం బాధాకరం. టీఎంసీకి ఓటేసిన ప్రజలు ఎంత దారుణంగా మోసపోయారో మనం గమనించాం. గత పది సంవత్సరాలలో ఇటువంటి ఉదంతాలను లెక్కకు మిక్కిలిగా గమనిస్తూనే ఉన్నాం; ఆఖరుకు ఆమ్ ఆద్మీ పార్టీకి కూడా ఇది తప్పలేదు. ప్రజల అభీష్టానికి ఎదురుతిరగలేని పరిస్థితి ఏర్పడితే తప్ప ఈ దుస్థితి మారదు. ఆ పరిస్థితి రావాలంటే ఎన్నికల ప్రక్రియను ప్రక్షాళన చేయాలి; అనుభవంలో తెలిసిన చట్టాల లొసుగులను తొలగించాలి. కానీ అటువంటి లొసుగులను అవకాశాలుగా మలచుకుంటున్న రాజకీయ పార్టీలు వాటిని స్వచ్ఛందంగా మార్చవు; ప్రజలే ఉద్యమించాలి. పార్టీలలో అంతర్గత కుమ్ములాటలు ఆ పార్టీని విశ్వసించిన ప్రజల మనోభావాలను ఎప్పటికీ దెబ్బతీయకూడదు.!

- ఇంద్రాణి

## చరిత్రలో ఈ రోజు

ఆగస్టు 27

AUG 27

* ఎయిర్ ఇండియా దినోత్సవం
* 1908: ఆస్ట్రేలియా క్రికెటర్ డోనాల్డ్ బ్రాడ్‌మాన్ జననం (మ.2001).
* 1955: గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ మొదటి సంచిక ప్రచురించబడింది.
* 1957: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన న్యాయమూర్తి నూతలపాటి వెంకటరమణ జననం.
* 1963: భారతీయ సినిమా నటి సుమలత జననం.
* 1972: భారతీయ మల్లయోధ నిపుణుడు, నటుడు ది గ్రేట్ ఖలీ జననం. (చిత్రంలో)
* 1976: హిందీ సినిమా నేపథ్య గాయకుడు ముకేష్ మరణం (జ.1923).
* 1995: ఈటీవీ తెలుగు టెలివిజన్ ప్రసారాలు ప్రారంభమయ్యాయి.
* 2002: ఉపాధ్యాయ ఉద్యమ రథసారథి, శాసన మండలి సభ్యుడు సింగరాజు రామకృష్ణయ్య మరణం (జ.1911).
* 2010: ఆయుర్వేద, లైంగిక వ్యాధుల నిపుణుడు కంభంపాటి స్వయంప్రకాష్ మరణం (జ.1962).



ది గ్రేట్ ఖలీ

## వాస్తవాలు బయటపడతాయనే

## జగన్ సభకు రావడం లేదు: కొల్లు రవీంద్ర



అమరావతి: ఎల్‌నినోపై అసెంబ్లీలో చర్చకు వస్తే వైకాపా ఐదేళ్ల పాలనలోని వాస్తవాలు బయటపడతాయనే జగన్ సభకు రాకుండా ప్రెస్‌మీట్‌లు పెడుతున్నారని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. జగన్ హయాంలో సాగునీటి ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు. చంద్రబాబు ముందుచూపుతో జలాశయాల్లో నీటిని నిల్వ చేయడం వల్లే ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొంటున్నామన్నారు. తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. గతంలో పట్టిసీమను విమర్శించిన జగన్.. ఇప్పుడు దాని ప్రయోజనాలను చూడాలన్నారు. రాయలసీమకు జగన్ ద్రోహం చేశారని, 102 టెండర్లు రద్దు చేశారని కొల్లు రవీంద్ర ఆరోపించారు. బీసీలు బాగుపడటం ఆయనకు ఇష్టం లేదన్నారు. బీసీ రిజర్వేషన్ల కోతపై గతంలో పట్టించుకోని వ్యక్తికి ఇప్పుడు మాట్లాడే నైతిక అర్హత లేదని మండిపడ్డారు. మద్యం రవాణా కుంభకోణంలో వైకాపా నేత కారుమూరి నాగేశ్వరరావు అడ్డంగా దొరికితే.. రాజకీయ ప్రయోజనాల కోసం బీసీ కార్డును వాడుతున్నారని ధ్వజమెత్తారు.




## ముగ్గురు మావోయిస్టుల లొంగుబాటు

రాజమహేంద్రవరం: పోలవరం జిల్లా చింతూరు డివిజన్ ఏజెన్సీలో ముగ్గురు మావోయిస్టులు లొంగిపోయారు. చింతూరు పోలీస్ స్టేషన్‌లో రంపచోడవరం ఓఎస్డీ పంకజ్‌కుమార్ మీనా ఎదుట వారు లొంగిపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మావోయిస్టు పార్టీ క్రమంగా బలహీనపడుతోందన్నారు. ఏజెన్సీ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధిని చూసి మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి వస్తున్నట్లు చెప్పారు. లొంగిపోయిన వారిలో మావోయిస్టు అగ్రనేత హిడ్మా పర్సనల్ గార్డ్‌గా పనిచేసిన ముచ్చకి మంగి, కడితి లక్ష్మయ్య, కడితి వెంకి ఉన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన పలు ఎన్‌కౌంటర్లు, మావోయిస్టుల కార్యకలాపాల్లో వీరి పాత్ర ఉందన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం తరఫున సాయంతోపాటు పునరావాసం, సంక్షేమ పథకాలు, అన్ని సదుపాయాలు అందేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

## గల్లంతైన ఏడుగురు

## మత్స్యకారుల ఆచూకీ లభ్యం



అమరావతి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ లభ్యమైంది. వీరు పశ్చిమబెంగాల్‌లో సురక్షితంగా ఉన్నట్లు మత్స్యశాఖ సహాయ సంచాలకులు రమణారావు తెలిపారు. అల్లవరం మండలం ఓడలరేవు తీరం నుంచి ఏడుగురు మత్స్యకారులు ఈనెల 3న వేటకు వెళ్లారు. ఆ తర్వాత వారి ఆచూకీ తెలియరాలేదు. దీంతో ఈనెల 17 నుంచి 10 రోజుల పాటు నేవీ, కోస్ట్‌గార్డ్, మెరైన్ సిబ్బంది విస్తృతంగా గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో మత్స్యకారుల బోటు ఆచూకీని కోల్‌కతా సమీపంలో గుర్తించినట్లు రమణారావు తెలిపారు. వారిని సురక్షితంగా స్వస్థలాలకు తీసుకొస్తున్నట్లు చెప్పారు. మత్సకారులు సురక్షితమని సమాచారం రావడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# ఖాతాలో పాతిక వేలు.. నేతన్నలకు గుడ్ న్యూస్ చెప్పిన మంత్రి సవిత

- **'నేతన్న సేవ' పథకంలో కొత్త దరఖాస్తుదారులకు ఈ నెలాఖరులోగా ఆర్థిక సాయం**
- **పరిశీలన అనంతరం అర్హులైన ప్రతి ఒక్కరి ఖాతాలో రూ. 25,000 జమ**
- **మొదటి విడతలో 71,536 మందికి రూ.166 కోట్లు అందించామని వెల్లడి**
- **చేనేత కార్మికులకు 50 ఏళ్లకే రూ. 4000 పెన్షన్ ఇస్తున్నామని స్పష్టీకరణ**
- **గత వైసీపీ ప్రభుత్వం చేనేత రంగాన్ని పూర్తిగా విస్మరించిందని విమర్శ**

ఆంధ్రప్రదేశ్‌లో చేనేత కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి అండగా నిలుస్తుందని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి వి. సవిత స్పష్టం చేశారు. 'నేతన్న సేవ' పథకం కింద కొత్తగా దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లో ఈ నెలాఖరులోగా రూ. 25,000 జమ చేస్తామని ఆమె శుభవార్త తెలిపారు. పెనుకొండలో మంత్రి మాట్లాడుతూ ఈ వివరాలు వెల్లడించారు. తొలి విడతలో భాగంగా ఇప్పటికే 71,536 మంది నేతన్నలకు రూ.166 కోట్ల ఆర్థిక సాయం అందించామని మంత్రి గుర్తుచేశారు. తాజాగా మరో 36,617 మంది ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారని, వాటి పరిశీలన ప్రక్రియ వేగంగా జరుగుతోందని తెలిపారు. ఈ నెలాఖరు నాటికి అర్హుల జాబితాను



ఖరారు చేసి, ప్రతి ఒక్కరి ఖాతాలో రూ. 25,000 జమ చేస్తామని హామీ ఇచ్చారు. నేతన్న సేవ పథకంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనవసర రాద్ధాంతం చేస్తోందని ఆమె విమర్శించారు. వ్యవసాయం తర్వాత రాష్ట్రంలో అత్యధిక జనాభా ఆధారపడిన చేనేత రంగానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి సవిత అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం చేనేత కార్మికులను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. 201419 మధ్య చంద్రబాబు పాలన చేనేత కార్మికులకు స్వర్ణయుగమని, నేతన్నల కష్టాలు తెలిసిన వ్యక్తిగా చంద్రబాబు 50 ఏళ్లకే పెన్షన్ పథకాన్ని అమలు చేశారని కొనియాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ మాట నిలబెట్టుకుంటూ, 86,000 మంది నేతన్నలకు 50 ఏళ్లకే నెలకు రూ. 4,000 చొప్పున పెన్షన్ అందిస్తోందని వివరించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలతో పాటు, చెప్పని పథకాలను కూడా అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా, రాష్ట్రవ్యాప్తంగా 52,952 మంది చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. మగ్గాలకు (హ్యాండ్లూమ్స్) 200 యూనిట్లు, పవర్ లూమ్‌లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నట్లు ఆమె స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ నేతన్నల పక్షపాతి అని, వారి అభివృద్ధికి అన్ని చర్యలూ తీసుకుంటుందని మంత్రి సవిత భరోసా ఇచ్చారు.

## జెన్‌జీ యువతతో మాటామంతి.. కోటంరెడ్డికి మంత్రి లోకేశ్ అభినందనలు

నెల్లూరు: జెన్‌జీ యువతతో నిరంతరం మమేకమై వారి ఆశయాలు, ఆకాంక్షలను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి నారా లోకేశ్ (Lokesh) అన్నారు. యువత అభిప్రాయాల ఆధారంగా వారికి ప్రయోజనం చేకూర్చేలా కార్యక్రమాలను రూపొందించాలని



సూచించారు. నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నిర్వహిస్తున్న 'జెన్‌జీ యువతతో మాటామంతి' కార్యక్రమంపై లోకేశ్ ట్వీట్ చేశారు. యువతతో జరగనున్న ఆసక్తికరమైన, ఆలోచనాత్మకమైన భావ వినిమయ కార్యక్రమం కోసం తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు వెల్లడించారు.

## సీఎస్ కుమార్తె వివాహానికి హాజరైన సీఎం చంద్రబాబు

- **ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కుమార్తె వివాహ వేడుక**
- **హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరైన సీఎం దంపతులు**
- **నూతన వధూవరులు త్రైలోక్య, ప్రభాస్‌లను ఆశీర్వదించిన చంద్రబాబు**
- **సీఎస్ సాయి ప్రసాద్ కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) జి. సాయి ప్రసాద్ కుమార్తె వివాహ వేడుకకు ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా భువనేశ్వరి దంపతులు హాజరయ్యారు. హైదరాబాద్ శివార్లలోని జన్‌వాడలో ఉన్న ఆర్య కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివరాల్లోకి వెళితే, సీఎస్ సాయి ప్రసాద్ కుమార్తె త్రైలోక్య పావనికి, ప్రభాస్ వెంకట్‌తో బుధవారం వివాహం జరిగింది. ఈ వేడుకకు సతీసమేతంగా హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు, నూతన దంపతులను ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎస్ సాయి ప్రసాద్ కుటుంబ సభ్యులతో చంద్రబాబు దంపతులు కాసేపు ముచ్చటించారు. తమ కుమార్తె వివాహానికి విచ్చేసి ఆశీర్వదించినందుకు ముఖ్యమంత్రి దంపతులకు సాయి ప్రసాద్ కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

## జగన్‌కు చెక్ పెట్టేందుకు బీసీలు ఏకమవుతున్నారు : ఎంపీ చింతకాయల విజయ్



అమరావతి: తమ జీవితాలతో ఆడుకుంటున్న జగన్‌కు చెక్ పెట్టేందుకు బీసీలు ఏకమవుతున్నారని రాజ్యసభ సభ్యుడు చింతకాయల విజయ్ అన్నారు. బీసీలను రాజకీయంగా ఉపయోగించుకుని మోసం చేస్తే రాష్ట్రంలో వైకాపాను లేకుండా చేస్తారని హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వల్లే బీసీ అంటే బ్యాక్‌వర్డ్ క్లాస్ నుంచి బ్యాక్‌బోన్ క్లాస్‌గా మారిందన్నారు. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించి బీసీలను బెస్ట్ క్లాస్‌గా తీర్చిదిద్దుతున్నారని గుర్తు చేశారు. జగన్ హయాంలో బీసీ రిజర్వేషన్లు కుదించి దాదాపు 16 వేల మందికి రాజకీయ అవకాశాలను దూరం చేశారని ధ్వజమెత్తారు. బీసీలపై ఊచకోతలు, తెదేపా బీసీ నాయకులపై అక్రమ కేసులు వైకాపా హయాంలోనే జరిగాయని మండిపడ్డారు. వైకాపాలో బీసీ నాయకులు బానిస బతుకులు బతికారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలుగుదేశం పార్టీకి, బీసీలకు విడదీయరాని బంధం ఉందని, తెలుగుదేశం అంటే తమ పార్టీ అని బడుగు బలహీన వర్గాలు గర్వంగా చెప్పుకొంటున్నాయని చింతకాయల విజయ్ అన్నారు.

## రాయలసీమకు జగన్ ఏం చేశారు?: మంత్రి నిమ్మల సూటి ప్రశ్న

- **ఐదేళ్లలో రాయలసీమకు జగన్ చేసిందేమీ లేదని మంత్రి నిమ్మల విమర్శ**
- **గొడ్డలి పార్టీ నేతకు ప్రాజెక్టులపై అవగాహన శూన్యమని ఎద్దేవా**
- **శ్రీశైలం, తుంగభద్ర, గోరుకల్లు మరమ్మతులను జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు**
- **సీమకు ఏ ముఖ్యమంత్రీ చేయని ద్రోహం జగన్ చేశారని ఆరోపణ**
- **కూటమి ప్రభుత్వం వచ్చాకే ప్రాజెక్టుల పనులు వేగవంతం అయ్యాయని వెల్లడి**

వైసీపీ అధినేత జగన్‌పై రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఐదేళ్ల పాలనలో రాయలసీమ ప్రాజెక్టులకు చేసిందేమీ లేని జగన్, ఇప్పుడు నీటిపారుదల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. చరిత్రలో ఏ ముఖ్యమంత్రీ చేయని ద్రోహాన్ని జగన్ రాయలసీమకు చేశారని, ప్రాజెక్టులపై కనీస అవగాహన లేని వ్యక్తి గొడ్డలి పార్టీ నాయకుడని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "'రప్ప రప్ప' అంటూ పొట్టేళ్లను నరికినట్లు నరుకుతామని హెచ్చరికలు చేసే జగన్ నోటి నుంచి రాయలసీమ, ఇరిగేషన్ మాటలు రావడం హాస్యాస్పదం. తన ఐదేళ్ల పాలనలో శ్రీశైలం, పోతిరెడ్డిపాడులకు ఏం చేశారో చెప్పుకోలేని దుస్థితిలో ఆయన ఉన్నారు" అని దుయ్యబట్టారు. "సూపర్ ఎల్ నినో ప్రభావంతో గతేడాది 2,000 టీఎంసీలు వచ్చిన శ్రీశైలంకు ఈసారి కేవలం 208 టీఎంసీల నీరే వచ్చింది. ఇందులో మన వాటా 66 శాతమే. అయినా రాయలసీమ తాగునీటి అవసరాల కోసం ప్రతిరోజూ 11,500 క్యూసెక్కుల నీటిని పంపిస్తున్నాం. నీటిని పొదుపుగా వాడుకోవాలని, 2027 జులై వరకు తాగునీటి అవసరాలకే ప్రాధాన్యత ఇవ్వాలని మే నెల నుంచే రైతులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం" అని మంత్రి వివరించారు. తెలంగాణ విద్యుదుత్పత్తి వల్ల శ్రీశైలం నీరు వృథా అవుతోందన్న జగన్ వ్యాఖ్యలపై స్పందిస్తూ.. "శ్రీశైలంలో విద్యుదుత్పత్తి చేస్తే ఆ నీరు నాగార్జునసాగర్‌కే వస్తుందన్న కనీస జ్ఞానం ఐదేళ్లు సీఎంగా చేసిన వ్యక్తికి లేకపోవడం విడ్డూరం. ఆ నీరు కూడా మన తాగునీటి అవసరాలకే ఉపయోగపడుతుంది. అనవసర విద్యుదుత్పత్తిని నియంత్రించాలని ఇప్పటికే కేఆర్ఎంబీకి, కేంద్ర జలశక్తి శాఖకు లేఖలు రాశాం" అని తెలిపారు.



### జగన్ ఐదేళ్లలో ఏం చేశారు?

* "2019లో 49 సీట్లు ఇచ్చి గెలిపిస్తే రాయలసీమకు ఏం చేశారో జగన్ గుండెల మీద చేయి వేసుకుని చెప్పగలరా?" అని నిమ్మల ప్రశ్నించారు. అంతేకాదు, గత ప్రభుత్వ వైఫల్యాలను ఏకరువు పెట్టారు.
* శ్రీశైలం: ప్రాజెక్టుకు ప్రమాదం ఉందని సీడబ్ల్యూసీ హెచ్చరించినా ఐదేళ్లలో పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.203 కోట్లతో మరమ్మతులు చేపట్టింది.
* తుంగభద్ర: సీమకు జీవనాధారమైన ఈ ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోయే ప్రమాదం ఉన్నా పట్టించుకోలేదు. మా ప్రభుత్వం 33 గేట్లను మార్చి 105 టీఎంసీల నీటిని నిల్వ చేసేలా చర్యలు తీసుకుంది.
* గోరుకల్లు: రిజర్వాయర్ ప్రమాదంలో ఉందని అధికారులు హెచ్చరించినా ఒక్క రూపాయి ఖర్చు చేయలేదు. మేము రూ.59 కోట్లతో టెండర్లు పిలిచి పనులు మొదలుపెట్టాం.
* హంద్రీనీవా: ఐదేళ్లలో జగన్ చేయలేని పనులను, మా ప్రభుత్వం ఒక్క ఏడాదిలోనే రూ.3,860 కోట్లతో చేపట్టింది. తిరుమల వరకు కృష్ణా జలాలను తీసుకెళ్లేందుకు మరో రూ.1,300 కోట్లతో పనులకు శ్రీకారం చుట్టింది.
* వైసీపీ పాలనలో రాయలసీమకు మోసం తప్ప ఏమీ జరగలేదని వారి పార్టీ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రెడ్డే స్వయంగా చెప్పారని నిమ్మల రామానాయుడు గుర్తుచేశారు.

## గల్లంతైన మత్స్యకారులు సురక్షితంగా ఉన్నారు

బంగాళాఖాతంలో ఈ నెల ప్రారంభంలో గల్లంతైన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు మత్స్యకారుల ఆచూకీ లభ్యమైందని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు బుధవారం ప్రకటించారు. వారంతా సురక్షితంగా ఉన్నారని, దీంతో వారి కుటుంబసభ్యులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారని తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఓడలరేవుకు చెందిన ఏడుగురు మత్స్యకారులు ఆగస్టు 3న సముద్రంలోకి వేటకు వెళ్లారు. షెడ్యూల్ ప్రకారం వారు ఆగస్టు 12 నాటికి తిరిగి తీరానికి చేరుకోవాల్సి ఉంది. అయితే, గడువు దాటినా వారి నుంచి ఎలాంటి సమాచారం అందకపోవడంతో కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ విషయం ప్రభుత్వ దృష్టికి రావడంతో వెంటనే గాలింపు చర్యలు ప్రారంభమయ్యాయి. మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించిన వివరాల ప్రకారం, మత్స్యకారులు ప్రయాణిస్తున్న బోటులో సాంకేతిక లోపం తలెత్తడంతో అది పశ్చిమ బెంగాల్ తీరానికి కొట్టుకుపోయింది. అక్కడి అధికారుల ద్వారా సమాచారం అందుకున్న ఏపీ అధికారులు, బోటు యజమాని సోదరుడైన భవానీ ప్రసాద్‌తో మాట్లాడి మత్స్యకారులంతా క్షేమంగా ఉన్నట్లు ధ్రువీకరించుకున్నారు. వారిని సురక్షితంగా స్వస్థలాలకు తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని, అధికారుల బృందాన్ని వెంటనే పశ్చిమ బెంగాల్‌కు పంపాలని మంత్రి ఆదేశించారు. మత్స్యకారుల



ఆచూకీ కోసం ప్రభుత్వం విస్తృత స్థాయిలో గాలింపు చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఇండియన్ కోస్ట్ గార్డ్ (ICG), నౌకాదళం, ఇతర విభాగాలతో సమన్వయం చేసుకుంటూ గాలింపు జరిపారు. మంగళవారం నాడు ఆపరేషన్‌ను మరింత ముమ్మరం చేసి, 15 కోస్ట్ గార్డ్ నౌకలు, నాలుగు హెలికాప్టర్లను రంగంలోకి దించారు. కోల్‌కతాలోని ఈస్టర్న్, నార్త్ ఈస్టర్న్ కమాండ్‌లను అప్రమత్తం చేయడంతో పాటు, మెరైన్ రెస్క్యూ కోఆర్డినేషన్ సెంటర్ (MRCC) పర్యవేక్షణలో ఎలక్ట్రానిక్ నిఘా కూడా కొనసాగించారు. అవసరమైతే సమాచారం లభించవచ్చనే ఉద్దేశంతో పొరుగు దేశాలైన మయన్మార్, బంగ్లాదేశ్ సముద్రయాన అధికారులను కూడా అప్రమత్తం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం సమష్టి కృషితోనే మత్స్యకారుల ఆచూకీని కనిపెట్టగలిగామని, ఈ ఆపరేషన్‌లో పాలుపంచుకున్న జిల్లా కలెక్టర్, కమిషనర్, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్, కోస్ట్ గార్డ్ సిబ్బందిని మంత్రి అచ్చెన్నాయుడు అభినందించారు.

## జోరుగా 'ఇంటింటికీ తెలుగుదేశం'.. ఒక్కరోజే 2.31 లక్షల ఇళ్లకు!

- **31వ రోజుకు చేరుకున్న 'ఇంటింటికీ తెలుగుదేశం-2026' కార్యక్రమం**
- **ఇప్పటివరకు మొత్తం 86.24 లక్షల ఇళ్లను సందర్శించిన పార్టీ శ్రేణులు**
- **ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ప్రజల అభిప్రాయాలను సేకరిస్తున్న నేతలు**
- **కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని తెలిపిన టీడీపీ**
- **ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 2.31 లక్షల కుటుంబాలను కలిసిన నాయకులు**

కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు, ప్రభుత్వ పనితీరుపై వారి అభిప్రాయాలను నేరుగా తెలుసుకునేందుకు తెలుగుదేశం పార్టీ (టీడీపీ) ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం




ఉత్సాహంగా కొనసాగుతోంది. బుధవారంతో ఈ కార్యక్రమం 31వ రోజు పూర్తి చేసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటున్నారు. బుధవారం ఒక్కరోజే 2,31,918 ఇళ్లను సందర్శించి, ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కార్యక్రమం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు మొత్తం 86.24 లక్షల కుటుంబాలను పార్టీ శ్రేణులు నేరుగా కలిశాయని టీడీపీ వర్గాలు వెల్లడించాయి. ఈ కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు ప్రతి గడపకూ వెళ్లి, ఆయా కుటుంబాలకు అందుతున్న ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను వివరిస్తున్నారు. ముఖ్యంగా రైతులు, మహిళలు, యువత, పేదలు, మధ్యతరగతి వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న భరోసాను, అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేస్తున్నారు. అదే సమయంలో, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి సూచనలు, అభిప్రాయాలను నేరుగా స్వీకరిస్తున్నారు. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుండటంతో ఈ కార్యక్రమం మరింత ఉత్సాహంగా ముందుకు సాగుతోందని టీడీపీ నేతలు తెలిపారు. అనేక ప్రాంతాల్లో ప్రజలు కూడా స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటూ తమ అభిప్రాయాలను పంచుకుంటున్నారని వారు పేర్కొన్నారు. ప్రజా భాగస్వామ్యంతో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా కొనసాగించాలని పార్టీ నాయకత్వం నిర్ణయించింది.

## స్థానిక ఎన్నికల్లో కూటమి శ్రేణులు సమన్వయంతో పని చేయాలి: పురందేశ్వరి

- **కూటమి ఎన్నికల్లో కూటమి ఐక్యంగా బరిలోకి దిగుతుందన్న పురందేశ్వరి**

ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఎన్డీఏ కూటమి (టీడీపీ బీజేపీ జనసేన) ఐక్యంగానే బరిలోకి దిగుతుందని బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందరేశ్వరి స్పష్టం చేశారు. రాజమండ్రిలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మన ఊరు - మన జెండా' కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రాజానగరం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిలతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... 2024 అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన చారిత్రాత్మక విజయం మాదిరిగానే, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థుల గెలుపు కోసం భాగస్వామ్య పార్టీల నాయకులు, కార్యకర్తలు పూర్తి సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. 2024లో ప్రజలు అందించిన బలమైన మద్దతును స్థానిక సంస్థల్లోనూ పునరావృతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాష్ట్రంలో బీజేపీ క్రమంగా బలోపేతమవుతోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సంపూర్ణ సహకారంతో రాజధాని అమరావతి నిర్మాణంతో పాటు పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతమయ్యాయని, రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత లభిస్తోందని తెలిపారు. దేశ, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య



సమన్వయం అత్యంత కీలకమని... స్థానిక సమరంలో కూటమి జెండాను ఎగురవేసేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు.

# నా స్థైర్యం నువ్వే బ్రహ్మణి.. వివాహ వార్షికోత్సవం రోజున లోకేశ్ ఎమోషనల్ పోస్ట్

- **మంత్రి నారా లోకేశ్, బ్రహ్మణిల 19వ వివాహ వార్షికోత్సవం**
- **సోషల్ మీడియా వేదికగా ఒకరికొకరు శుభాకాంక్షలు**
- **ప్రతి కష్టసుఖంలో అండగా నిలిచావంటూ భార్యకు లోకేశ్ ప్రేమ సందేశం**
- **20వ ఏడాదిలోకి అడుగుపెడుతున్నామంటూ బ్రహ్మణి సంతోషం**
- **వారిద్దరి పోస్టులు సోషల్ మీడియాలో వైరల్**

ఆంధ్రప్రదేశ్ మంత్రి, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్, ఆయన అర్ధాంగి నారా బ్రహ్మణి నేడు (ఆగస్టు 26) తమ 19వ వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని, వారు సోషల్ మీడియా వేదికగా ఒకరిపై ఒకరు ప్రేమను కురిపించుకున్నారు. వారిద్దరూ పంచుకున్న భావోద్వేగ సందేశాలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ తన అర్ధాంగి బ్రహ్మణికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. బ్రాహ్మణి పెట్టిన పోస్టును పంచుకుంటూ తన ప్రేమను వ్యక్తం చేశారు. "19 సంవత్సరాలు. 6,940 రోజులు. ప్రతి కష్టసుఖంలో, ప్రతి గెలుపోటములో నువ్వు నాకు అండగా నిలిచావు. ఓర్పు, బలం, బేషరతైన ప్రేమను



పంచావు. బ్రహ్మణి, నువ్వు అన్నింటిలోనూ నాకు స్థిరంగా తోడున్నావు. హ్యాపీ యానివర్సరీ. ఇలాంటివి మరెన్నో జరుపుకోవాలి" అంటూ లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. అంతకుముందు నారా బ్రహ్మణి తమ పెళ్లి రోజుపై సంతోషాన్ని పంచుకున్నారు. "హ్యాపీ యానివర్సరీ, మై లవ్. మనం కలిసి 20వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్నాం. మనం కలిసి నిర్మించుకున్న ఈ ప్రపంచానికి, పంచుకున్న జ్ఞాపకాలకు, కొనసాగిస్తున్న ఈ ప్రయాణానికి నేను ఎంతగానో కృతజ్ఞురాలిని. ప్రతి ఎత్తుపల్లంలో నువ్వే నాకు అండగా నిలిచావు. భవిష్యత్తులో రాబోయే మరెన్నో సాహసాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. మన దాంపత్య జీవితంలో ఉత్సాహంగా 20వ ఏట అడుగుపెడుతున్నా!" అని బ్రాహ్మణి తన పోస్టులో పేర్కొన్నారు. 2007 ఆగస్టు 26న నారా లోకేశ్, బ్రహ్మణిల వివాహం జరిగింది. వారికి దేవాన్ష్ అనే కుమారుడు ఉన్నాడు. రాజకీయాల్లో ఎంత బిజీగా ఉన్నప్పటికీ, లోకేశ్ తన కుటుంబానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తారనే విషయం తెలిసిందే. ఈ దంపతుల అన్యోన్యతకు, వారి ప్రేమ సందేశాలకు అభిమానులు, టీడీపీ కార్యకర్తల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.

## "అలసిన అక్షరాలు"

ఒక దేశంపై మరో దేశం విజయ కాంక్షతో
పేల్చిన బాంబుల శబ్దాలను ఏ భాష అక్షర
మాలగా కూర్చగలను?

మిత్ర దేశం శత్రు దేశమై సాగించే ఆక్రమణ
యుద్ధాలను ఎన్ని భాషల అక్షరాల్లో లెక్కించను?

మనిషి నేర్చుకున్న అమానవీయపు అధునాతన
ఆయుధ హింస భాషను ఏ కొత్త లిపిలో
రాయగలను?

అహంకార పరిపాలకుల పాదాల క్రింద నలిగిన
కపాలాలకు ఎన్ని పదాలతో తెల్ల కాగితపు
స్మశానంలో శవ పేటికలను సిద్ధం చేయను?

ఎన్నో బ్రతుకులు యుద్ధ కాలానికి బంధీలైతే
విడిపోయిన ప్రేమలను ఎన్ని పద బంధాలతో ఒక
చోట కలపగలను?

ఎందరో కన్నతల్లుల కడుపు కోతను ఎన్ని
వాక్యాలతో ఓ యుగపు కన్నీటి కావ్యాన్ని
కనగలను?

గుట్టలుగా పడిన శవాల సామూహిక ఖననాలను
ఏ గొప్ప కవి గర్వపడే కవితల పుస్తకంగా



నేపా సంతోష్ అచ్యుత్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, కాళోజీ ప్రతిభా పురస్కార గ్రహీత.8639442397

కొనియాడగలను?

బహుసా మూడో ప్రపంచ యుద్ధపు చివరి
మానవుని చావు ఆక్రందనలతో శూన్యంలో
చేరిపోయి నా అలసట నుంచి సేద తీరగలనేమో.

## జెన్ జీ యువతతో సమావేశాలు.. కోటంరెడ్డిపై లోకేశ్ ప్రశంసలు

- **యువత ఆశలు, లక్ష్యాలను తెలుసుకోవడం నాయకులకు అవసరమన్న లోకేశ్**
- **యువతో జరిగే ఇలాంటి కార్యక్రమాల కోసం తాను కూడా ఎదురు చూస్తున్నానన్న మంత్రి**
- **లోకేశ్ ఆలోచనల నుంచే తాను ప్రేరణ పొందానన్న కోటంరెడ్డి**

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి 'జెన్ జీ' యువతతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడం పట్ల ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. తర్వాతి తరం ఆలోచనలను అర్థం చేసుకోవడానికి ఈ కార్యక్రమం ఒక అద్భుతమైన చొరవ అని ఆయన కొనియాడారు. ప్రస్తుత యువత ఆశలు, లక్ష్యాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, వారి నూతన ఆలోచనలను తెలుసుకోవడం నాయకులకు ఎంతో అవసరమని లోకేశ్ అన్నారు. యువత ఆకాంక్షలను సరిగ్గా అర్థం చేసుకుని, వారికి ఉపయోగపడే



కార్యక్రమాలను రూపొందించడానికి ప్రజాప్రతినిధులు వారితో నిరంతరం సంప్రదింపులు జరపాలని సూచించారు. యువతతో జరిగే ఇటువంటి ఆసక్తికరమైన, లోతైన భావాల మార్పిడి కార్యక్రమాల కోసం తాను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని తెలిపారు. మరోవైపు, లోకేశ్ అభినందనలపై కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి స్పందిస్తూ... నారా లోకేశ్ దార్శనికత, ఆలోచనల నుంచి ప్రేరణ పొందే తాము ఈ 'జెన్ జీ' సమావేశాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. నవతరం యువత ఆలోచనలు, వారి ఆకాంక్షలు, ప్రభుత్వంపై వారి అంచనాలను ప్రత్యక్షంగా తెలుసుకోవడమే ఈ సమావేశాల ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు.

## పోలవరం వద్ద గోదావరికి పోటెత్తుతున్న వరద.. 48 గేట్లు ఎత్తివేత

- **రెండు, మూడు రోజులుగా ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షా లు**
- **పోలవరం ప్రాజెక్ట్ కాఫర్ డ్యామ్ వద్ద 30.30 మీటర్లకు చేరుకున్న గోదావరి నీటిమట్టం**
- **4.10 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్న అధికారులు**



గత రెండు, మూడు రోజులుగా తెలంగాణతో పాటు ఎగువ ప్రాంతాలలో పడుతున్న భారీ వర్షాల వల్ల గోదావరి నదిలోకి వరద నీరు పోటెత్తుతుంది. ఈ క్రమంలో పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి ప్రవాహం తీవ్రతరమైంది. ప్రాజెక్టు పరిధిలోని ఎగువ కాఫర్ డ్యామ్ వద్ద గోదావరి నీటిమట్టం 30.30 మీటర్లకు చేరుకోగా, స్పిల్ వే వద్ద నీటిమట్టం 30.20 మీటర్లుగా నమోదైంది. వరద నీటిని క్రమబద్ధీకరించేందుకు అధికారులు స్పిల్ వేకు చెందిన 48 గేట్లను ఎత్తివేసి, దిగువకు 4.10 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గోదావరి వరద ప్రభావంతో దేవీపట్నం మండలంలోని ప్రసిద్ధ గండిపోశమ్మ ఆలయాన్ని వరద నీరు చుట్టుముట్టింది. ఆలయ ప్రాంగణంలోని క్యూ లైన్లు, చుట్టుపక్కల ఉన్న దుకాణాలు పూర్తిగా నీట మునిగిపోయాయి. పి.గొందూరు నుంచి నాగులపల్లి గ్రామాల మధ్య రహదారిపైకి వరద నీరు చేరుకోవడంతో అమ్మవారి ఆలయానికి వెళ్లే దారిలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. నదిలో నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉన్నందున, పర్యాటకుల భద్రత దృష్ట్యా పాపికొండల విహారయాత్రకు వెళ్లే బోట్ల రాకపోకలను నిలిపివేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

## సరికొత్త హైబ్రిడ్ సైబర్ ఫ్రాడ్.. అప్రమత్తంగా ఉండాలి: సీపీ సజ్జనర్

హైదరాబాద్: నగరంలో సరికొత్త హైబ్రిడ్ సైబర్ ఫ్రాడ్ ముఠాల పట్ల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సీపీ సజ్జనర్ హెచ్చరించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రద్దీగా ఉండే ఆర్టీసీ బస్సులు, బహిరంగ ప్రదేశాల్లో సీనియర్ సిటిజన్లు, సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా ఉన్న అమాయకులను లక్ష్యంగా చేసుకుని ఈ ముఠాలు ఫోన్లను దొంగిలిస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్‌ఫోన్లు వాడుతున్న వృద్ధులు, అమాయకులను మొదట గుర్తిస్తారని.. స్క్రీన్ లాక్ ఎలా ఓపెన్ చేస్తున్నారో వెనుక నిలబడి నిశితంగా గమనించి అనంతరం చోరీ చేస్తున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు. ఒకవేళ ఫోన్ లాక్ అయి.. పాస్‌వర్డ్ తెలియకపోతే వీరు అత్యంత చాకచక్యంగా 'సోషల్ ఇంజినీరింగ్' నాటకాలకు తెరలేపుతారని సీపీ చెప్పారు. ''బాధితుడు తన పోయిన ఫోన్‌కు కాల్ చేయగానే నిందితులు లిఫ్ట్ చేసి.. తాము బస్సు కండక్టర్/ డ్రైవర్ అని, ఫోన్



బస్సులో దొరికిందని చెబుతారు. వచ్చే స్టాప్‌లో ఇచ్చేస్తామని నమ్మిస్తారు. ఆ తర్వాత వివరాలు సరిచూడాలనే నెపంతో బాధితుడితోనే స్క్రీన్ లాక్ పాస్‌వర్డ్ చెప్పించుకుంటారు. మరికొన్ని సందర్భాల్లో రోడ్డుపై ఫోన్ దొరికిందని.. వేరొకరు కూడా ఆ ఫోన్ తమదే అని క్లెయిమ్ చేస్తున్నారని చెబుతారు. ఫోన్ మీదే అని రుజువు కావాలంటే స్క్రీన్ పాస్‌వర్డ్ చెప్పాలని నమ్మించి అన్‌లాక్ వివరాలు రాబడతారు. ఒకవేళ ఫోన్ పోయినట్లయితే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే సంబంధిత టెలికాం సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించి సిమ్ కార్డును బ్లాక్ చేయించాలి. వెంటనే బ్యాంక్ కస్టమర్ కేర్‌కు కాల్ చేసి నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ సేవలను తాత్కాలికంగా ఫ్రీజ్ చేయించాలి. కేంద్ర ప్రభుత్వానికి చెందిన అధికారిక పోర్టల్ www.ceir.gov.inలో మొబైల్ IMEI నంబర్ నమోదు చేసి ఫోన్‌ను వెంటనే బ్లాక్ చేయించాలి. ఒకవేళ ఖాతా నుంచి డబ్బులు కట్ అయినట్లు గుర్తిస్తే వెంటనే జాతీయ సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్ చేయాలి. ముఖ్యంగా ఇంట్లోని యువత తమ కుటుంబాల్లోని సీనియర్ సిటిజన్లు, వృద్ధులకు ఈ తరహా సరికొత్త నేరాల పట్ల అవగాహన కల్పించి, వారు ప్రయాణాల్లో ఫోన్లు వాడేటప్పుడు అప్రమత్తంగా ఉండేలా చూసుకోవాలి'' అని సీపీ సూచించారు.

## నా బిడ్డ ప్లాన్-బి ఏంటో నాకు తెలియదు: కొండా మురళి

హైదరాబాద్: తాము కాంగ్రెస్‌ను వీడేది లేదని మంత్రి కొండా సురేఖ భర్త, ఆ పార్టీ నేత కొండా మురళి అన్నారు. ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కొండా మురళి సమావేశమయ్యారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న తాజా పరిణామాల నేపథ్యంలో కీలక నేతలు భేటీ కావడం సర్వత్రా ఆసక్తికరంగా మారింది. అనంతరం కొండా మురళి మీడియాతో మాట్లాడారు. ''కొండా సురేఖ అంశం, తాజా రాజకీయ పరిణామాలపై ఈ సమావేశంలో చర్చించలేదు. సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంకపై సంపూర్ణ విశ్వాసం ఉంది. మా కుమార్తె సుస్మిత వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు. నా బిడ్డ ప్లాన్‌ఎ ప్రకారం వ్యాఖ్యలు చేసింది. ప్లాన్‌బి ఏమిటో నాకు తెలియదు. మంత్రి సురేఖ మంగళవారం వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. నేడు కూడా మరో కార్యక్రమానికి హాజరయ్యారు. క్రమశిక్షణ కమిటీ నిర్ణయం వెలువడే వరకు ఏమీ మాట్లాడను'' అని కొండా మురళి వ్యాఖ్యానించారు.

* **క్రమశిక్షణ కమిటీ నిర్ణయమే ఫైనల్: రాజగోపాల్‌రెడ్డి**

తన నియోజకవర్గ బిల్లుల కోసమే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసినట్లు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. అప్పటికే ప్రజాభవన్‌లో కొండా మురళి ఉన్నట్లు తెలిపారు. దీంతో ఆయన్ను కలిసి మాట్లాడినట్లు



రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. తాను సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడలేదన్నారు. కొండా సురేఖపై క్రమశిక్షణ కమిటీ నిర్ణయమే ఫైనల్ అని పేర్కొన్నారు. ఈ విషయంలో సీఎం చెప్పినదే తన అభిప్రాయమన్నారు.

### నేపాల్‌లో మెరుపు వరదలు..
## తెలంగాణభవన్‌లో హెల్ప్‌లైన్ ఏర్పాటు

దిల్లీ: నేపాల్ మెరుపు వరదల్లో చిక్కుకుపోయిన తెలంగాణ వాసులకు సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో దిల్లీలోని తెలంగాణ భవన్‌లో అధికారులు హెల్ప్‌లైన్, కోఆర్డినేషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఎవరైనా తమ బంధువులు, కుటుంబ సభ్యుల ఆచూకీ తెలియకపోతే.. వెంటనే హెల్ప్‌లైన్‌ను సంప్రదించవచ్చని కోరారు. బాధితుల పేరు, పాస్‌పోర్టు వివరాలు, మొబైల్ నంబర్, నేపాల్‌లో చివరిసారిగా పర్యటించిన ప్రదేశం, టూర్ ఆపరేటర్ వివరాలు అందించాలని సూచించారు. భారత విదేశాంగ మంత్రిత్వశాఖ, కాఠ్మాండులోని భారత రాయబార కార్యాలయం, ఇతర అధికారులతో తెలంగాణభవన్ సమన్వయం చేస్తున్నట్లు తెలిపారు. హెల్ప్‌లైన్ నంబర్లు: వందన: 9871999044, చక్రవర్తి: 9949351270, రక్షిత్ నాయక్: 9618597969.

WALK - IN INTERVIEW
ప్రపంచ ప్రఖ్యాతి చెందిన బ్లాక్ గాలక్సీ గ్రానైట్ మైన్
మిడ్ వెస్ట్ లిమిటెడ్
నందు, R.L.పురం, చీమకుర్తి, ప్రకాశం మరియు కోదాడ ప్రాంతాలలో పనిచేయుటకు కావలెను.
ఈ క్రింద తెలిపిన ఉద్యోగములు ఖాళీ గలవు.
1. ఎక్సకావేటర్ ఆపరేటర్
2. ఎక్సకా డ్రిల్ ఆపరేటర్
3. డంపర్ (వాల్వోట్రక్) ఆపరేటర్
4. వీల్ లోడర్ ఆపరేటర్
5. టామ్ రాక్ ఆపరేటర్
6. వెల్డర్స్
7. ఎలక్ట్రిషియన్స్
8. హెల్పర్స్
ఆసక్తికలవారు వాక్ ఇన్ - ఇంటర్వ్యూ :
On 25th & 26th August 2026 at 9AM to 6PM
Hotel Swetha Karimnagar, Beside Bus Stand, Opp. Municipal Corporation Office, Karimnagar, Telangana- 505001. Ph: 8121006637, 9121170404

WANTED
ADDITIONAL FACULTY
COMP.SCIENCE, MATHS, PHYSICS
(Full time / Part time)
KAKATIYA
MAHILA DEGREE COLLEGE
Nakkalagutta, Hanamkonda
Contact:
9014418408/ 8121470116




# బంగారం, వెండిపై సుంకాలు.. తగ్గింపు యోచనలో సర్కారు?

విదేశీ మారకపు నిల్వలను కాపాడు కోవడానికి బంగారం, వెండిపై దిగుమతులపై సుంకాలు పెంచిన కేంద్రం.. మళ్లీ వాటిని తగ్గించాలని ఆలోచన చేస్తోందా? అంటే అవుననే అంటున్నాయి సంబంధిత వర్గాలు. ఈ రెండు లోహాలపై ప్రస్తుతం ఉన్న దిగుమతి సుంకాలను తగ్గించే అంశంపై కేంద్ర ప్రభుత్వం అంతర్గతంగా చర్చిస్తోందని తెలిసింది. ఈ మేరకు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ 'మనీకంట్రోల్' ఓ కథనాన్ని ప్రచురించింది. బంగారంపై 15 శాతంగా ఉన్న దిగుమతి సుంకాన్ని 6 శాతానికి తగ్గించాలని బులియన్ వ్యాపారులు, ఆభరణాల తయారీ పరిశ్రమ ప్రతినిధులు కేంద్రాన్ని కోరుతున్నారు. మరోవైపు అధిక పన్నుల భారం వల్ల అక్రమ మార్గాల్లో బంగారం దేశంలోకి రావడం పెరిగిపోవడం ప్రభుత్వ దృష్టికి వచ్చింది.



గణాంకాల పరంగా దిగుమతులు తగ్గినప్పటికీ.. స్మగ్లింగ్ రూపంలో బంగారం తరలుతున్నట్లు తేలింది. సుంకాలు తగ్గిస్తే అధికారిక దిగుమతులు పుంజుకుంటాయని ప్రభుత్వం భావిస్తోంది. సుంకాలు తగ్గించే అంశంపై ఇంకా చర్చలు జరుగుతున్నాయని, దీనిపై ఇంకా ఎలాంటి నిర్ణయం ఏదీ తీసుకోలేదని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. విదేశీ మారక ద్రవ్య నిల్వలను కాపాడేందుకు, రూపాయి విలువ క్షీణతను అరికట్టేందుకు ఈ ఏడాది మే 13న బంగారం, వెండిపై కేంద్రం సుంకాలు పెంచింది. 6 శాతంగా ఉన్న సుంకాన్ని 15 శాతానికి చేర్చింది. ఏటా సుమారు 700800 టన్నుల బంగారాన్ని భారత్ దిగుమతి చేసుకుంటోంది. సుంకం పెంచకముందు గతేడాదితో పోల్చినప్పుడు ఈ ఏడాది ఏప్రిల్‌లో దిగుమతులు 82 శాతం పెరగ్గా.. పెంపు అనంతరం 34 శాతం మాత్రమే వృద్ధి నమోదుకావడం గమనార్హం. ఆ మేర అక్రమ రవాణా పెరిగిందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. బంగారంతో పాటు ప్లాటినం, వెండిపై లోహాలపై సుంకాల తగ్గింపుపైనా సమాలోచనలు జరుగుతున్నాయని తెలిసింది.

## ప్రపంచంలో అత్యంత ఆదరణ పొందిన కంపెనీ యాపిల్

ప్రముఖ టెక్ దిగ్గజం యాపిల్ మరో ఘనత సాధించింది. ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఆదరణ పొందిన కంపెనీగా నిలిచింది. మైక్రోసాఫ్ట్, అమెజాన్ కంపెనీలు ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈ మేరకు ప్రముఖ కన్సల్టింగ్ సంస్థ కార్న్ ఫెర్రీ, ఫార్చ్యూన్.కామ్ సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 1500 కంపెనీలపై సర్వే నిర్వహించి ఈ ర్యాకింగ్‌లు ఇచ్చారు. ఆదాయం ఎక్కువ ఉన్న కంపెనీలను వడబోసి జాబితా రూపొందించారు. 3 వేల మందికి పైగా ఎగ్జిక్యూటివ్‌లు, డైరెక్టర్లు, సెక్యూరిటీస్ విశ్లేషకుల ఆధారంగా టాప్ 50 ర్యాంకులను నిర్ణయించారు. ఆవిష్కరణలు, నిర్వహణ, సామాజిక బాధ్యత, కంపెనీ ఆస్తులు వంటి పలు విభాగాల్లో మొదటి స్థానంలో నిలిచి యాపిల్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. ఏఐ



రంగంలో నాయకత్వం, ఓపెన్‌ఏఐ భాగస్వామ్యం, కోపైలట్ బ్రాండెడ్ ఏఐ అప్లికేషన్స్ ఆధారంగా మైక్రోసాఫ్ట్ రెండో స్థానంలో నిలిచింది. అమెజాన్ 3, ఎన్విడియా 4, జేపీమోర్గాన్ చేజ్ 5, బెర్క్‌షైర్ హాత్వే 6, కాస్ట్‌కో హోల్‌సేల్ 7, ఆల్ఫాబెట్ 8, వాల్‌మార్ట్ 9, అమెరికన్ ఎక్స్‌ప్రెస్ 10వ స్థానాలను ఆక్రమించాయి.

# షార్క్‌ట్యాంక్‌లా.. భారత్‌జపాన్ స్టార్టప్ సిరీస్: ప్రతిపాదించిన గోయల్

భారత్‌జపాన్ మధ్య స్టార్టప్ భాగస్వామ్యాన్ని పెంచేందుకు కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ఆసక్తికర ప్రతిపాదన చేశారు. 'షార్క్‌ట్యాంక్'లా.. భారత్‌జపాన్ స్టార్టప్ సిరీస్‌ను నిర్వహించాలని సూచించారు. దీంతో రెండు దేశాల్లోని ఔత్సాహిక వ్యాపారవేత్తలు, పెట్టుబడిదారుల మధ్య సమన్వయం తీసుకువచ్చి, వ్యాపార అవకాశాలు మెరుగుపర్చవచ్చని అభిప్రాయపడ్డారు. జపాన్



రాజధాని టోక్యోలో స్టార్టప్స్‌పై తాజాగా రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. షార్క్ ట్యాంక్ మాదిరిగా వర్చువల్‌గా సెషన్స్ నిర్వహించాలని పెట్టుబడిదారులకు గోయల్ సూచించారు. దాంతో స్టార్టప్‌లను నిర్వహిస్తోన్న ఔత్సాహికులు తమ ఆలోచనలను వివరించడానికి ఆ సిరీస్ మంచి వేదిక అవుతుందన్నారు. దీనివల్ల భారత్ స్టార్టప్ ఆలోచనలు జపాన్ పెట్టుబడిదారులకు తెలుస్తాయన్నారు. అదేవిధంగా జపాన్ స్టార్టప్‌లు భారత్‌లో వ్యాపార భాగస్వాములను గుర్తించేందుకు వీలు కలుగుతుందని చెప్పారు. ఒక వ్యాపార ఆలోచన కార్యరూపం దాల్చితే.. అది క్రమంగా ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు బలోపేతం చేయడానికి దోహదం చేస్తుందన్నారు. భారత్‌లో డీప్‌టెక్, ప్రారంభ దశలో ఉన్న సంస్థల్లో జపాన్ సంస్థలు పెట్టుబడులు పెట్టాలని ఈ సందర్భంగా మంత్రి కోరారు. షార్క్‌ట్యాంక్ అంటే వ్యాపారరంగంలో రాణించాలనుకునేవారు తమ కొత్త ఆలోచనలు, ఉత్పత్తులను ఇన్వెస్టర్ల ముందు వివరించి.. పెట్టుబడులు పొందేలా రూపొందించిన ఒక బిజినెస్ రియాలిటీ షో.

## ఎంజీ హెక్టర్ టొమాహాక్ PHEV.. ఫుల్ ట్యాంక్ + ఛార్జ్‌తో 1100km

ప్రముఖ కార్ల తయారీ సంస్థ జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా హెక్టర్ టొమాహాక్ ఎస్‌యూవీని దేశీయ మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఇది బీఈవీ, పీహెచ్‌ఈవీ వేరియంట్లలో లభిస్తుంది. ప్లగ్‌ఇన్ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ వేరియంట్ ధర BaaSతో అయితే రూ.21.79 లక్షలు (ఎక్స్ షోరూమ్) నుంచి ప్రారంభమవుతుంది. బ్యాటరీ సబ్‌స్క్రిప్షన్ కిలోమీటరుకు రూ.3.2 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. అదే బ్యాటరీ సబ్‌స్క్రిప్షన్ లేకుండా అయితే రూ.25.69 లక్షలు చెల్లించాలి. పూర్తి ఎలక్ట్రిక్ వెర్షన్ ప్రారంభ ధర బ్యాటరీ



సబ్‌స్క్రిప్షన్‌తో రూ.13.99 లక్షలుగా కంపెనీ నిర్ణయించింది. ఇందులో 69.2 కిలోవాట్ అవర్ బ్యాటరీ ప్యాక్ ఉంటుంది. సింగిల్ ఛార్జింగ్‌తో 517 కిలోమీటర్ల దూరం ప్రయాణించొచ్చు.

# త్వరలో దేశీయ మార్కెట్‌లోకి ఫిలిప్స్ స్మార్ట్‌ఫోన్స్

ప్రముఖ ఎలక్ట్రానిక్ సంస్థ ఫిలిప్స్ స్మార్ట్‌ఫోన్ సెగ్మెంట్‌లోకి అడుగుపెడుతోంది. ఇప్పటి వరకూ ఫీచర్ ఫోన్లకే పరిమితమైన ఈ కంపెనీ.. త్వరలోనే కొత్త స్మార్ట్‌ఫోన్‌ను లాంచ్ చేయనుంది. S7221 పేరిట తీసుకురాబోతుంది. ఇందుకు సంబంధింన ఫోన్ డిజైన్‌ను ఇప్పటికే అమెజాన్ మైక్రోసైట్‌లో కంపెనీ విడుదల చేసింది. ఫోన్ ధరలను, లాంచ్ తేదీని కంపెనీ పేర్కోనప్పటికీ.. కొన్ని ఫీచర్లను మాత్రం వెల్లడించింది. మైక్రోసైట్‌లోని వివరాల ప్రకారం.. 6జీబీ, 8జీబీ ర్యామ్, 128జీబీ, 256జీబీ స్టోరేజ్ సదుపాయంతో ఈ ఫోన్ రానుంది. 5జీకి సపోర్ట్ చేస్తుంది. డ్యూయల్ స్టీరియో స్పీకర్స్




అల్ట్రా మాక్స్ ఆడియో ఫీచర్లు ఉన్నాయి. ఫోన్ వెనుక వైపు 64ఎంపీ ఏఐ ప్రధాన కెమెరా, ముందు వైపు 16 ఎంపీ సెల్ఫీ కెమెరా ఉంటుంది. ఐపీ 64 రేటింగ్‌తో




రానున్న ఈ ఫోన్ వెనుక భాగంలో LED ఫ్లాష్‌లైట్ ఉంది. బ్లాక్, సిల్వర్, వైట్ రంగుల్లో లభ్యం కానుంది. అమెజాన్ ద్వారా ఈ స్మార్ట్‌ఫోన్ విక్రయించనున్నారు.

# మిచెల్ స్టార్క్ అగ్రస్థానం.. టాప్-10లోకి రిషభ్ పంత్

ఐసీసీ టెస్టు ర్యాంకులు విడుదలయ్యాయి. బౌలింగ్ విభాగంలో ఇప్పటి వరకూ అగ్రస్థానంలో ఉన్న జస్‌ప్రీత్ బుమ్రా రెండో స్థానానికి చేరాడు. శ్రీలంకతో టెస్టు సిరీస్‌లో బుమ్రా ఆడని విషయం తెలిసిందే. బంగ్లాదేశ్‌తో రెండో టెస్టులో నిప్పులు చెరిగే బౌలింగ్ వేసిన ఆసీస్ పేసర్ మిచెల్ స్టార్క్ అగ్రస్థానానికి దూసుకొచ్చాడు. ప్రస్తుతం అతడి ఖాతాలో 872 పాయింట్లు ఉన్నాయి. బుమ్రా (862), మ్యాట్ హెన్రీ (861) తర్వాత స్థానాల్లో నిలిచారు. ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ (807) కూడా ఒక స్థానాన్ని మెరుగుపర్చుకుని నాలుగో ర్యాంక్ అందుకొన్నాడు.

**కేఎల్ రాహుల్, పంత్ పైకి**

బ్యాటింగ్ విభాగంలో భారత ఆటగాళ్లు రిషభ్ పంత్, కేఎల్ రాహుల్ (35 నుంచి 30వ స్థానం) తమ ర్యాంకులను మెరుగుపర్చుకున్నారు. అయితే,





యశస్వి జైస్వాల్ రెండు స్థానాలు దిగజారాడు. టాప్ 10లో టీమ్‌ఇండియా నుంచి ఇద్దరు మాత్రమే చోటు దక్కించుకున్నారు. రిషభ్ పంత్ (711) ఆరు స్థానాలు ఎగబాకి ఏడో ర్యాంకుకు చేరాడు. శుభ్‌మన్ గిల్ (711) ఎనిమిదో స్థానానికి పడిపోయాడు. ఈ విభాగంలో ఇంగ్లాండ్ ఆటగాడు హ్యారీ బ్రూక్ (874), జో రూట్ (850), స్టీవ్ స్మిత్ (840), ట్రావిస్ హెడ్ (811), టెంబా బవుమా (775) తొలి ఐదు ర్యాంకుల్లో నిలిచారు. బెస్ట్ ఆల్‌రౌండర్‌గా రవీంద్ర జడేజా (428)దే అగ్రస్థానం.

# నా కెరీర్ నాశనమైంది: స్కూల్‌పై ఆసీస్ మాజీ క్రికెటర్ దావా

విల్ పుకోవిస్కి ఆస్ట్రేలియా తరఫున కేవలం ఒకే ఒక్క టెస్టు మ్యాచ్ ఆడి 27 ఏళ్ల వయసులోనే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 36 మ్యాచులు ఆడాడు. ఇంత త్వరగా అతడు ఆటకు గుడ్‌బై చెప్పడానికి కారణం విపరీతంగా గాయాలు కావడమే. అయితే, ఇలా జరగడానికి



మాత్రం తాను చదువుకున్న స్కూలేనని ఆరోపిస్తూ తాజాగా దావా వేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. టీనేజర్‌గా విల్ 2014లో మెల్‌బోర్న్‌లోని బ్రైటన్ ప్రైవేట్ స్కూల్‌లో విద్యనభ్యసించాడు. ఆ సమయంలో ఫుట్‌బాల్ ట్రైనింగ్ సెషన్‌లో పాల్గొన్నాడు. అప్పుడు అతడి వయసు 16 ఏళ్లు. తలకు గాయం కాగా.. స్కూల్ యాజమాన్యం మాత్రం సరైన వైద్యం అందించలేదని.. అందుకే తన క్రికెట్ కెరీర్‌లో 13సార్లు కంకషన్ ఎదుర్కోవాల్సి వచ్చిందని విల్ ఆరోపించాడు. దీంతో 2024లో క్రీడలకు వీడ్కోలు చెప్పాలని స్వతంత్ర మెడికల్ ప్యానల్ రికమెండ్ చేసినట్లు గుర్తు చేశాడు.

# ఆసియా క్రీడలు.. ఇకపై ఆ అభ్యర్థనలను స్వీకరించబోం: ఓసీఏ

జపాన్‌లోని నగోయా నగరం వచ్చే నెల 19 నుంచి అక్టోబర్ 4 వరకు ఆసియా క్రీడలకు ఆతిథ్యమివ్వనుంది. 45 దేశాల క్రీడాకారులు 43 క్రీడాంశాల్లో పోటీపడనున్నారు. ఇప్పటికే ఆయా దేశాలు ఆసియా క్రీడల్లో పాల్గొనే తమ బృందాలను ఖరారు చేస్తున్నాయి. ఈ క్రమంలో ఇటీవల ఆతిథ్య దేశమైన జపాన్ కీలక ప్రకటన చేసింది. స్థల కొరత వల్ల ఆసియా క్రీడల్లో 15,000 మందికి మించి ఆతిథ్యం ఇవ్వలేమని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఈ పోటీల్లో పాల్గొనే దేశాలకు ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా (OCA) కీలక సూచన చేసింది. చివరి నిమిషంలో అదనపు సభ్యులను చేర్చాలని కోరవద్దని, తమ బృందాల పరిమాణాన్ని నిర్దేశిత పరిమితులకు లోబడి ఉంచాలని సూచించింది. నామినేషన్ల గడువు గత నెలలోనే ముగిసినప్పటికీ క్రీడాకారుల బృందంలో ఆలస్యంగా పేర్లను చేర్చడానికి సంబంధించి అనేక సభ్య దేశాల నుంచి వచ్చిన రోజువారీ అభ్యర్థనలను తాము ఇప్పటికే పరిగణనలోకి తీసుకున్నట్లు ఓసీఏ తెలిపింది. అయితే, 15,000 మంది పరిమితి మించకూడదని నిర్వాహకులు స్పష్టం చేయడంతో ఇకపై కొత్త అభ్యర్థనలేవీ స్వీకరించబోమని, కేవలం రీప్లేస్‌మెంట్‌కు మాత్రమే అనుమతి ఉంటుందని స్పష్టం చేసింది. ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ ఆసియా నుంచి సూచనలు వచ్చిన విషయాన్ని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (SAI) వర్గాలు కూడా ధ్రువీకరించాయి. ఈ ఆసియా క్రీడల్లో భారత్.. క్రికెట్, హాకీ, రెజ్లింగ్, ఆర్చరీ సహా 35 క్రీడాంశాల్లో పోటీపడనుంది. 492 మంది అథ్లెట్లు వివిధ పోటీల్లో పాల్గొనబోతున్నారు. అత్యధికంగా అథ్లెటిక్స్




విభాగంలో 73 మంది బరిలోకి దిగనున్నారు.




# కుర్రాళ్లకే మంచిది కాదు.. బీసీసీఐ, ఐసీసీ కఠినంగా వ్యవహరించాలి: మంజ్రేకర్






ఆటతోనే కాకుండా.. ఇటీవల ప్రత్యర్థి ఆటగాళ్లపైకి సై అంటే సై అనేలా భారత యువ ఆటగాళ్లు దూసుకుపోతున్నారు. భారత్ A తరఫున ఆడేటప్పుడు వైభవ్ సూర్యవంశీ, సీనియర్ జట్టు ప్లేయర్ యశస్వి జైస్వాల్ శ్రీలంక ఆటగాళ్లపైకి వెళ్లిన సంగతి తెలిసిందే. వైభవ్ విషయంలో చర్యలు తీసుకోలేదు. కానీ, యశస్వి జైస్వాల్‌కు మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానా పడింది. అయితే, ఇలాంటి విషయాల్లో ఇంకాస్త కఠినమైన చర్యలు తీసుకోవాలని ఐసీసీ, బీసీసీఐకి మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ సూచించాడు. అలా చేస్తే.. క్రికెట్‌తోపాటు ఆ కుర్రాళ్లకూ మంచిదని వ్యాఖ్యానించాడు. "భారత్ Aకు ఆడుతున్నప్పుడు వైభవ్ సూర్యవంశీ.. ఇప్పుడీ టెస్టు సిరీస్‌లో యశస్వి జైస్వాల్ (Yashasvi Jaiswal) ప్రవర్తన అస్సలు బాగోలేదు. మీరు (ఐసీసీ, బీసీసీఐ) వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే.. అలాంటి ప్రవర్తనను పునరావృతం చేసేందుకు శిక్షణ ఇచ్చినట్లే అవుతుంది. ఇది ఆటకు మంచిది కాదు. అలాగే యువ క్రికెటర్ల భవిష్యత్తుకూ ప్రమాదకరం'' అని సంజయ్ మంజ్రేకర్ పోస్టు పెట్టాడు.

**అసలేం జరిగిందంటే..?**

గత జూన్‌లో శ్రీలంక Aతో భారత్ A ట్రై సిరీస్‌ను ఆడింది. సూర్యవంశీ ఔటైన తర్వాత.. డగౌట్‌కు వెళ్తుంటే శ్రీలంక ఆటగాడు విషేన్ హలమ్ ఏవో వ్యాఖ్యలు చేశాడు. దీంతో వెంటనే వైభవ్ కూడా వెనక్కి వచ్చి దీటుగా బదులిచ్చాడు. ఒకరిపైకి మరొకరు దూసుకెళ్లినంత పనైంది. సహచరులు కలగజేసుకొని పరిస్థితిని చక్కదిద్దారు. అయితే, వైభవ్‌తోపాటు లంక ప్లేయర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా కూడా ఇది తమ పరిధిలో లేదని వ్యాఖ్యానించడం గమనార్హం. అదంతా మ్యాచ్ అధికారులు, క్రికెట్ అథారిటీకి సంబంధించిన విషయమని స్పష్టం చేశారు. ఇప్పుడు యశస్వి జైస్వాల్ అంశంలో మాత్రం ఐసీసీ జరిమానా విధించింది. మ్యాచ్ రిఫరీ నిర్ణయం మేరకు చర్యలు తీసుకొంది.

